
సేవ, ప్రేమ, ధ్యానం, సాక్షాత్కారం
దివ్య జీవన సంఘం

Pages - 60 - Rs. 10/-

# శివానంద భారతి

దివ్య జీవన ఆధ్యాత్మిక, సాంస్కృతిక మాసపత్రిక

మే : 2019 శ్రీ వికారి : వైశాఖం
సంపుటి : 17 సంచిక - 7



స్వామి శివానంద



స్వామి చిదానంద



స్వామి దేవానంద



స్వామి సత్యవ్రతానంద



ఆదిశంకరాచార్య జయంతి,
వైశాఖ శు॥ పంచమి
2019 మే 9



బుద్ధ జయంతి
వైశాఖ పూర్ణిమ
18-05-2019




స్వాతంత్ర్యవీర సావర్కర్
జయంతి
28 మే 2019

## ఏ.పి.డివైన్ లైఫ్ సొసైటి

శ్రీ శివానందాశ్రమం, పద్మారావునగర్, సికింద్రాబాద్, తెలంగాణ రాష్ట్రం

*Spiritual Monthly Magazine :* **SIVANANDA BHARATHI**

**స్వామి చిదానంద ఉషోదయ ఉపన్యాసాలు**



# (29) విజయసిద్ధి వంటి విజయం లేదు

మనం వినే నానుడులు, లోకోక్తులు, సామెతలు సామాన్య మైనవి గావు ; మానవ ప్రవర్తనా పరీక్షల నుంచి జనించిన వేదాంత పరమైన సత్యాలివి.

ఏ పనిలోనైనా విజయం సాధించాలంటే దృఢ దీక్ష అవసరం. ప్రతి వ్యక్తి విజయ సాధన కోసమే పనిచేస్తాడు. విజయం అనే పదంలోనే ఎంతో ఆకర్షణ ఉంది. విజయ సిద్ధివంటి విజయంలేదని పాశ్చాత్య దేశాల్లో ఒక సూక్తి (లోకోక్తి) ఉంది.

అపజయానికి ముఖ్యకారణం ఆత్మవిశ్వాసం లేకపోవడం. భయాందోళనలూ, సంకోచాలు, విరుద్ధ భావాలు మనస్సులో చోటు చేసుకొంటే లభించేది అపజయమే. మనసు ఓడిపోతానను కొంటే చాలు జరిగేదదే ! మొదటే నేను జయించలేనని అనుకొంటే ఓటమితప్పదు.

సంకల్పం, సద్గుణ సంపన్నత విజయానికి కారణమవుతుంది. నేను ఏ పనినైనా చేయగలను నేను సాధించలేని కార్యముండదు. తప్పక విజయం సాధిస్తాను అనే దృఢ నిర్ణయంతో ఉండాలి.

ఒక్కొక్కప్పుడు అపజయాన్ని ఎదుర్కొంటూ ఉన్నప్పటికీ, **"నేను కృషితో సాఫల్యం సాధిస్తాను, తప్పక సాధించి తీరుతాను, ప్రస్తుత పరిస్థితి కేవలం తాత్కాలికం ; చివరకు విజయప్రాప్తి కల్గితీరుతుంది"** అనే అచంచల విశ్వాసంతో, యోగ సాధనా సామగ్రితో అంత:కరణను సంసిద్ధం చేసుకొని ఉండాలి. విజయం చేకూరేవరకూ నా కృషి ఆగేది లేదు. ఈ విధంగానే నిరంతర సాధన చేస్తూనే ఉంటాను అనే ఆలోచన ఉండాలి. వందసార్లు, వెయ్యి మార్లు అపజయం పొందినా, విజయం సారథ్యం పొందే వరకూ కృషి – నిరంతర కృషి చేస్తూనే ఉండాలి.

దైవమే నా చెంతన ఉంది అనే భావనతో పనిచేయాలి. విజయం ఆత్మ విశ్వాసాన్నిస్తుంది. మనోధైర్యాన్నిస్తుంది.

**సంగ్రహానుసరణ : ధర్మవీర**

# శివానంద భారతి

దివ్య జీవన ఆధ్యాత్మిక, సాంస్కృతిక మాసపత్రిక

**Sivananda Bharathi**
**Spiritual Monthly Magazine**


Vol. : 17 సంపుటి: 17
Edition : 7 సంచిక: 07
శ్రీ వికారి : వైశాఖం
మే – 2019
May - 2019


**బ్రహ్మలీనులు పరమపూజ్యులు, శ్రీ స్వామి శివానంద, శ్రీ స్వామి చిదానంద, శ్రీ స్వామి దేవానంద ఆశీస్సులతో**


వ్యవస్థాపకులు :
**బ్రహ్మలీన**
**స్వామి సత్యవ్రతానంద**

సంపాదకులు :
**ఆచార్య కసిరెడ్డి**

సహ సంపాదకులు :
**తిప్పరాజు కొండల్‌రావు**

సంపాదక మండలి :
**బొప్పన అరుణాదేవి**
**జి. సుధీర్‌కుమార్**
**డా॥ భేరీ సునీత**
**మరీచిక**


**శివానంద భారతి చందా వివరాలు.**
సంవత్సరం చందా రూ.100/– శాశ్వత చందా రూ. 1100/–. సంవత్సర చందా కన్నా ఎక్కువ పంపరాదు. శాశ్వత చందా, పత్రిక నడచినంత కాలం అని గ్రహించగలరు.

## విషయసూచిక


| | |
|---|---|
| ఆత్మీయ భారతి – స్వామిజీ .... –ఆశ్రమ కార్యవర్గం | 4 |
| సంపాదక భారతి – భారతం సర్వోన్నతం – .... | 5 |
| హిందూ ధర్మ సమగ్ర స్వరూపం – స్వామి శివానంద | 8 |
| భావ పరిణతి – మానవ జీవితం – స్వామి సర్వవిదానంద | 13 |
| శ్రీ రమణతత్త్వము – శ్రీమతి బొప్పన అరుణాదేవి | 17 |
| మన పూర్వీకుల దృక్పథం – అను. తిప్పరాజు కొండల్‌రావు | 20 |
| ద్వాదశాక్షరీ మంత్రం విశిష్టత – తిప్పరాజు గోపాల్‌రావుగారు | 25 |
| శ్రీకృష్ణ భారతి – ఎ. వెంకటస్వామి | 29 |
| భజన భారతి – కోడం మల్లయ్య | 30 |
| ప్రార్థన భారతి – ఆచార్య కసిరెడ్డి | 31 |
| జీవుడా మేలుకో ! – బ్రహ్మలీన శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి | 32 |
| మనసు యొక్క ... – డా॥ క్రొవ్విడి సుబ్బారావు | 34 |
| శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రం – ఆచార్య కసిరెడ్డి | 39 |
| కబీర్ – శ్రీవత్స | 43 |
| *Sri Krishna-The Ideal of ...* - Sri Sivananda | 45 |
| *Philosohpy ...* - Dr. Vanasri | 49 |
| అద్వైత సిద్ధాంత స్థాపకుడు – జమదగ్ని | 52 |
| మహాభారతాంస్థములైన . – శ్రీమతి హేమలతా బాలసుబ్రహ్మణ్యం | 53 |
| వేదమ్మకు నీరాజనం – ఆకుల రామయ్య | 56 |
| వార్తా భారతి | 57 |
| విశేష భారతి | 58 |


**ఆయా రచయితల అభిప్రాయాలు వారివే. ఆశ్రమ పత్రిక ఆలోచనా మాధ్యమం మాత్రమే.**

**ఆత్మీయ భారతి**

**సేవించు, ప్రేమించు,**
**ధ్యానించు-సాక్షాత్కారం పొందు**

**ధర్మం అంటే!**

**శ్లో॥ ధృతిః, క్షమా, దమో, అస్తేయం - శౌచమింద్రియ నిగ్రహః ।**
**ధీర్విద్యా సత్యమక్రోధో - దశకం ధర్మలక్షణమ్ ॥** (మనుస్మృతి)

తా॥ ధైర్యం, సహనం, నిగ్రహం, దొంగతనం చేయకుండడం, శుభ్రత, ఇంద్రియాదులకట్టడి, బుద్ధి, విద్యా, సత్యం, అక్రోధం ఈ పది ధర్మ లక్షణాలు.

**ధర్మపథం - భారతం**

**కం॥ ఒరులేయవి యొనరించిన - నరవర ! అప్రియము తన మనంబునకగు, తా**
**నొరులకు నవి సేయకునికి - పరాయణము పరమ ధర్మపథములకెల్లన్**

తా॥ ఇతరులు ఏది చేసినచో మన మనస్సునకు కష్టము కలుగునో, ఆ పని మనము ఇతరులకు చేయకూడదు. ధర్మమార్గములలో కెల్ల ఇదే గొప్పది. **- భారతం**

# స్వామిజీ జయంతి మే - 10

ఆశ్రమంలో నిత్య నైమిత్తిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. స్వామి శివానందుల, స్వామి చిదానందుల ఆశయాలకనుగుణంగా, వారి సమన్వయ తత్త్వసారాన్ని, సమరసతా భావజాలాన్ని పత్రిక ద్వారా అందించే ప్రయత్నం జరుగుతున్నది.

“ఎల్లప్పుడూ ప్రసన్న చిత్తుడవై ఆనందముతో నిండి యుండుము. నీవు ఆ విధముగా ఉన్ననాడు, అందరినీ ఆనందపరచగలవు. ఈ భూమిపై మనకు ప్రసాదించబడిన జీవిత ఉద్దేశ్యము అందరినీ ఆనంద పరవశులుగా ప్రసన్న చిత్తులుగా చేయుటకొరకే !”

అన్న స్వామి చిదానందుల మాటలు అందరం అక్షరాలా నమ్మి పాటించే ప్రయత్నం చేద్దాం ! **శ్రీశ్రీశ్రీ స్వామి సత్యవ్రతానంద సరస్వతీ మహారాజ్ గారి జయంతి కార్యక్రమాలను మే 10 తేదీన నిర్వహించుకొంటున్నాం. ఆ సందర్భంగా జరిగే కార్యక్రమాలన్నిటిలో పాల్గొందాం.**

ధన్యవాదాలతో . . .

**శ్రీ శివానందాశ్రమం**
పద్మారావునగర్, సికింద్రాబాద్
01-05-2019

భవదీయ
**ఆశ్రమ కార్యవర్గం**
**శివానంద భారతి, సంపాదక మండలి**

## సంపాదక భారతి

# భారతం సర్వోన్నతం - ఒక ఎజెండా కావాలా !

"భారతీయుల అంతిమలక్ష్యం ఆత్మసాక్షాత్కారం అన్నారు స్వామి శివానందులు. ఈ సాక్షాత్కారం వ్యక్తిగతమా ! పూర్తి జాతిగతమా !

వ్యక్తి వికాసం లేకుండా, సమాజ వికాసం గానీ, జాతి వికాసం గానీ జరుగదు. అయితే ఈ వికాసానికి వ్యక్తిగతంగా, సమాజగతంగా, జాతిగతంగా కృషి జరగాలి.

దేశంలో ఇవాళ ఎన్నికల వాతావరణం అలముకొన్నది. 'ఆత్మసాక్షాత్కారం' – నిరంతరం పడే తపన. అయితే సమాజంలో, దేశంలో శాంతి నెలకొన్నప్పుడే, అందరూ ఆత్మసాక్షాత్కారం వైపుగా ఆలోచించే అవకాశం కలుగుతుంది. కాని ఒత్తిళ్ళకు తట్టుకొని నిలబడే వ్యక్తి ఎటువంటి పరిస్థితులలోను తన సాధనామార్గాన్ని వదిలిపెట్టడు.

అయితే దేశం పరమశాంతియుతంగా ఉండాలని ఎవరైనా కోరుకొంటారు. దేశం ఇవాళ ధర్మసత్రంగా మారింది. ఇవాళేకాదు ఎప్పుడో మారింది. ఎన్నో సంవత్సరాలుగా ఎందరో చొరబాటుదారులు దేశంలోకి ప్రవేశించారు. ఇంకా ప్రవేశిస్తూనే ఉన్నారు. జల–భూ–ఆకాశమార్గాల గుండా ఈ ప్రయత్నం జరుగుతూనే ఉన్నది. అలా వచ్చినవారు తమ తమ మాతృ పితృ దేశాల నుండి అనేక ఆర్థిక – వ్యాపార – ఆయుధాది వస్తు సహకారాన్ని పొందుతున్నారు. వారు దేశంలో చిన్న చిన్న రాజ్యాల్లాంటివి నెలకొల్పు కొంటున్నారు. ఇది ఈ మాతృభూమి పుత్రులకు ప్రమాదకరంగా పరిణమించింది. భౌతిక అస్తిత్వమే లేనప్పుడు ఆత్మసాక్షాత్కారం ఎక్కడ అనే ప్రశ్న పుట్టుకొని వస్తున్నది.

అందుకే ఆయా రాజకీయ పార్టీ జెండాలు, అజెండాలు ముందు పెడుతున్నాయి. హైదరాబాదులో విశ్వహిందూపరిషత్ 2004 జనవరి 13 నుండి 19వ తేదీన వరకు ఒక వారంరోజుల పాటు జాతీయస్థాయి కార్యవర్గ సమావేశాలు నిర్వహించింది. హిందూజాతి అస్తిత్వానికే ప్రమాదకరంగా పరిణమించిన మతాంతకరీణ పద్ధతులను ఆపాలన్నది. ఎక్కడి – ఆలయ – మఠ – మందిర వ్యవస్థ అక్కడి స్థానికులకే అప్పజెప్పాలన్నది. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం తగదన్నది. ఆలయ నిధులను హిందూ వ్యతిరేక శక్తుల నిమిత్తం ఖర్చు

సరళ స్వరూపులే - సత్య స్వరూపులు

చేయరాదన్నది. దేశంలో జిహాదీ తీవ్రవాది శక్తుల నుండి హిందువులనూ – హిందుత్వాన్ని – దేశాన్ని ధర్మాన్ని రక్షించుకొనే ప్రయత్నాలు హిందువులే మొదలు పెట్టాల్సిన సమయం ఆసన్నమైనదన్నది. హిందూ ఎజెండాను అనుసరించిన వారినే హిందువులు సమర్థించాలన్నది.

1) 'సర్వేభద్రాణి' పాటిస్తూనే కాశ్మీర్ తదితర సరిహద్దుల్లోని హిందువులలో నిర్భయ వాతావరణాన్ని నిర్మాణం చేయాలి.

2) గోరక్షణ వ్యవస్థ చేయాలి.

3) పశుపోషణ ద్వారా సుస్థిర ఆర్థిక వ్యవస్థను నిర్మింపజేయాలి.

4) హిందూ – మఠ – మందిర ఆశ్రమాదుల విషయంలో ప్రభుత్వ జోక్యం ఉండరాదు.

5) గంగా తదితర నదుల పవిత్రత కాపాడాలి.

6) సుప్రీంకోర్టు నిర్ణయానుసారం మొత్తం దేశం నిమిత్తం ఒకే సమాన పౌరచట్టాన్ని (కామన్ సివిల్ కోడ్) తేవాలి.

7) సంస్కృత భాష, ధార్మిక విద్య వికాసానికి దోహదం చేయాలి. రామాయణ – భారత – భాగవతాది గ్రంథాల అంశాలు పాఠ్యపుస్తకాలలో ఉండాలి.

8) మతమార్పిడి నిషేధించాలి. సేవ ముసుగులో మతం మార్పిడి నిమిత్తం వస్తోన్న విదేశీ ధనాన్ని నిరోధించాలి.

9) ఒకే దేశంలో ప్రాంతాల మధ్య భేదభావాన్ని సృష్టించే చట్టాలు తొలగించాలి. మున్ముందు అటువంటివి రాకుండా జాగ్రత్త పడాలి.

10) కాశ్మీరులో అపహరింపబడ్డ హిందువుల ఆస్తులను వారికి అప్పగించే ఏర్పాటు జరగాలి.

11) దేశంలోకి వచ్చిన – వస్తోన్న చొరబాటుదారులను బయటకు పంపాలి.

12) ప్రవాస హిందువులకూ ఇక్కడా – అక్కడా రక్షణ కల్పించాలి.

13) క్షీణిస్తున్న ప్రాచీన కళాఖండాలనూ, ఆలయాలనూ పరిరక్షించాలి.

**ఎంత కోల్పోయినప్పటికీ భవిష్యత్తు మిగిలే ఉంటుంది**

14) విదేశీశక్తుల దురాక్రమణల్లో విధ్వంసాలకు గురైన ఆలయాల పునరుద్ధరణ జరిగాలి. శ్రీరామజన్మభూమి అయోధ్య సమస్త పరిసరాలను భవ్యమందిర నిర్మాన నిమిత్తం కేంద్రం చట్టం తేవాలి. ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్న శ్రీరామజన్మ భూమిన్యాస్ భూమిని న్యాస్‌కే తిరిగి ఇవ్వాలి.

ఈ హిందూ ఎజెండాను సమర్థించే వారినే హిందువులు ఎన్నుకోవాల్సి ఉందని ఈ సభలలో పరిషత్ అభిప్రాయపడింది. ఇందులో శ్రీ చినజీయర్‌స్వామి తదితర సాధుసంతు లెందరో పాల్గొన్నారు. దేశంలోని అనేక సాధుసంతులు, మఠ మందిరాల వ్యవస్థల అధికారులు – సేవకులు చాలామంది ఈ కార్యక్రమాలన్నీ జరగాలని ఆశిస్తున్నారు.

ఏదైనా సామరస్య వాతావరణంలోనే జరగాలనీ అందరూ కోరుకొంటున్నారు. అందుకే స్వామి శివానందులవారు ఎప్పుడో ఈ క్రిందివిధంగా చెప్పారు.

**"నాజిజం, ఫాసిజం, నిరంకుశాధికారాన్ని చలాయించాలనుకొనే సామ్యవాదం వంటి అన్ని వాదాలు మానవునికి శాంతినందించడంలో విఫలమయ్యాయి. మానవునికి శాంతిని ప్రదానం చేసే శక్తి పవిత్ర భారతంలోని –**

**సాధువాదానికి**
**ఋషివాదానికి**
**ఉపనిషద్ వాదానికి**

**– మాత్రమే ఉంది. ఆత్మ సంయమనంతో భగవంతునిలో లీనం కావడం సాధువాదం, చిత్తశుద్ధి, నిస్వార్థసేవ, సమర్పణ, ధ్యానంద్వారా అమరత్వ సిద్ధి పొందడమే ఋషివాదం, ఆత్మవిశ్లేషణం, జిజ్ఞాస, శ్రుతిశ్రవణం, ఆత్మచింతనం, ఆత్మధ్యానం ద్వారా ఔపనిషదాత్మను అంటే బ్రహ్మజ్ఞానాన్ని సాక్షాత్కారించుకోవడమే ఉపనిషద్వాదం".**

మనం అదృష్టవంతులం ; మన భారతం సర్వోత్కృష్ట దేశం – అన్నారు స్వామి. గంగ సర్వోత్తమ స్రవంతి అని హిమాయలం సర్వోత్తమ పర్వతం అని, సత్యం సర్వోత్తమ గుణం అని ప్రవచించారు స్వామి శివానంద.

మరి ఈ సర్వోత్తమ స్థితిని కాపాడడానికి వికసింప చేయడానికి, సుస్థిర పరచడానికి పరిషత్ ఎజెండా ఉపకరిస్తుందా సంతోషం, పరమసంతోషం.

**– ఆచార్య కసిరెడ్డి, 98669 56250**

ప్రచారం కన్నా – ఆచరణ మిన్న

# హిందూ ధర్మ సమగ్ర స్వరూపం
## (ALL ABOUT HINDUISM)

## ఏడో అధ్యాయం

*(గత సంచిక తరువాయి)*

## హిందువుల ఆరాధన

– శ్రీ స్వామి శివానంద

### పూజ – ఇష్ట దేవత

శ్రీమహావిష్ణువు, అతని అవతారాలు, భగవాన్ శివుడు, శక్తి మొదలైన ముఖ్యమైన దేవతల రూపాలలో వున్న ప్రతిమలను, విగ్రహాలను ఇండ్లలోను, దేవాలయాలలోనూ పూజిస్తారు. తిరుమల, పండర్‌పూర్, పళని లాంటి దేవాలయాలలో వున్న విగ్రహాలు అతిపవిత్రమైన, శక్తివంతమైన దేవతలు, ప్రత్యక్ష దైవాలు. తమను ఆరాధించే భక్తులకు దర్శనమిస్తారు. వారి బాధలను నివారిస్తారు, వారిపై వరాల జల్లు కురిపిస్తారు. ఈ దేవతల లీలలు అమోఘం, అనిర్వచనీయం. హిందూధర్మం బహుళ దేవతారాధనా ధర్మం కాదు. శివుడు, విష్ణువు, బ్రహ్మ, శక్తి ఇవన్నీ భగవంతుడి అంశాలే.

భగవంతుడు తన భక్తులకు వివిధ రూపాల్లో దర్శనమిస్తాడు. భక్తుడు ఆరాధనకు ఏ రూపం ఎన్నుకుంటాడో  ఆ రూపంలో దర్శనమిస్తాడు. చతుర్భుజుడైన శ్రీహరిగా పూజిస్తే శ్రీహరిగా దర్శనమిస్తాడు  శివుడిగా ఆరాధిస్తే శివుడిగా ప్రత్యక్షమవుతాడు. దుర్గ లేదా కాళీమాతగా ఉపాసన చేస్తే ఆ రూపంలో దర్శనమిస్తాడు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు లేదా దత్తాత్రేయుడిగా పూజిస్తే ఆయా రూపాలలో ప్రత్యక్షమవుతాడు. క్రీస్తుగా లేదా అల్లాగా ఆరాధిస్తే ఆ రూపంలోనే అగుపడ్తాడు.

నీవు భగవంతుణ్ణి శ్రీహరి, శివుడు, గణేశుడు, సుబ్రహ్మణ్య స్వామి, దత్తాత్రేయుడు, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు లాంటి అవతారాలు  సరస్వతి, లక్ష్మి, కాళి, దుర్గ, చండి – ఏ రూపంలోనైనా పూజించవచ్చును. ఈ రూపాలన్నీ ఒకే భగవంతుడి, ఒకే ఈశ్వరుడి అంశలే, రూపాలే. ఏ నామ, రూపంలో ఆరాధించినా అది ఈశ్వరారాధనే. అన్ని నామ రూపాలు

**మనిషి తెలుసుకున్నది రవ్వంత – తెలుసుకోవలసినది కొండంత**

ఒక్కటే. ఒకరూపం, ఒక నామం మరోదాని కన్నా గొప్పది, శక్తివంతమైనది అని భావించడం అజ్ఞానమే. శివుడు, విష్ణువు, గాయత్రి, రాముడు, కృష్ణుడు, దేవి, బ్రహ్మం అంతా ఒక్కటే. సర్వం పరబ్రహ్మస్వరూపమే. నామాల్లో భేదం వున్నా, భక్తుల అభిరుచులలో విభేదాలున్నా ఆరాధించే తత్వం ఒక్కటే. అదే పరబ్రహ్మ తత్వం. ఈ సత్యాన్ని గుర్తించలేని వివిధ ధార్మికసంస్థలు అజ్ఞానం వల్ల తమలో తాము పరస్పర ఘర్షణకు పాల్పడతాయి.

## విగ్రహారాధన - దాని ప్రాశస్త్యం

నూతన ఆధ్యాత్మిక సాధకుడికి విగ్రహం ఒక ఆధారం, ఆధ్యాత్మిక బాల్యానికి ఒక ఆలంబన. ఆరంభదశలో ఆరాధన చేయడానికి ఒక రూపం అవసరం. అది భగవంతుడి భౌతికచిహ్నం, అది భగవంతుణ్ణి జ్ఞాపకం చేస్తుంది. ఆ భౌతికమూర్తి మనస్సులో ఆలోచన కలుగజేస్తుంది. విగ్రహారాధన వల్ల మనస్సుకు ఏకాగ్రత కలుగుతుంది. ప్రతి భక్తుడు – అనంతం, సర్వశక్తిత్వం, సర్వజ్ఞత్వం, సర్వవ్యాప్తం, స్వచ్ఛత, స్వేచ్ఛ, సంపూర్ణత్వం, పవిత్రత, సత్యం – వీటితో తన ఆలోచనాసరళిని అన్వయించుకోవాలి. నిరాకార అనంతంపై మనస్సు ధారణచేయడం కష్టతరం. ధారణ అభ్యసించే చాలా మంది సాధకులకు ఒక భౌతికరూపం చాలా అవసరం. మామూలు మనిషికి సర్వత్రా భగవంతుణ్ణి దర్శించడం, అంతటా భగవంతుడి ఉనికిని అనుభవించడం అసాధ్యం. ఆధునిక మానవుడికి విగ్రహారాధన ఒక సులభమైన పూజా సాధనం. ధారణచేయడానికి అనువైనమార్గం చాలా అవసరం. మనస్సు, తన ఆధారానికి ఒక ఆలంబనను ఆశిస్తుంది. ఆరంభంలో మనస్సుకు నిరాకార పరబ్రహ్మ భావన కలగడం చాలా కష్టం. ఆ దశలో ధారణ చేయడానికి, ధ్యానం చేయడానికి ఒక బాహ్య, భౌతిక ఆలంబన, చిహ్నం అత్యవసరం.

## అందరూ విగ్రహారాధకులే

వేదాలలో విగ్రహారాధన గురించి ప్రస్తావన లేదు. గృహాలలోను, దేవాలయాలలోను విగ్రహారాధన వున్నట్టు పురాణాలలో, ఆగమాలలో వర్ణనలున్నాయి. విగ్రహారాధన హిందూధర్మానికి మాత్రమే ప్రత్యేకం కాదు. క్రైస్తవులు శిలువను పూజిస్తారు. వారి మనస్సుల్లో శిలువ రూపం ముద్రింపబడి వుంటుంది. మహమ్మదీయులు పవిత్రమైన కాబాశిలరూపాన్ని ప్రార్థన చేస్తారు. కొందరు యోగులు, వేదాంతులు తప్ప అందరూ విగ్రహారాధకులే. వారంతా ఏదో ఒక రూపాన్ని తమ మనస్సులో ప్రతిష్ఠించుకుంటారు.

**తక్కువ మాట్లాడు ఎక్కువ పని చేయి**

మనస్సులో ప్రతిష్ఠించుకున్న రూపం కూడా ఒక విగ్రహమే. స్థాయీభేదం తప్ప విషయంభేదం కాదు. ఎంతటి తెలివిగల భక్తులైనా తమమనస్సులో ఏదో ఒక రూపాన్ని సృజించుకొని, ఆ రూపంపైనే మనస్సును స్థిరపరుస్తారు. ప్రతి వ్యక్తి విగ్రహారాధకుడే. చిత్రం అయినా పటం అయినా విగ్రహస్వరూపమే. స్థూలమనస్సు భౌతిక ఆలంబనను కోరుకుంటే సూక్ష్మమనస్సు నిరాకారచిహ్నాన్ని కోరుకుంటుంది. చివరికి వేదాంతులకు కూడా చంచలమైన తమ మనస్సులను ఏకాగ్రత పరచడానికి 'ఓం' అన్న చిహ్నం కావాలి. రాతితో, కర్రతో చెక్కిన విగ్రహాలే కాదు, వేదాంతులు, నాయకులు కూడా మూర్తులుగా మారిపోతారు. మరి విగ్రహారాధనను ఎందుకు ఖండిస్తారు?

## భగవంతుడితో సంబంధం ఏర్పర్చుకోవడానికి సాధనం

విగ్రహాలు శిల్పి కళాచాతుర్యానికి నిదర్శనం మాత్రమే కాదు, భక్తుడి మనస్సు భగవంతుడి వైపు ఆకర్షణతో 'అతడి' వైపు పరవళ్ళుతొక్కుతూ ప్రవహించడానికి సహకరించే తేజోవంతమైన సాధనాలు. విగ్రహారాధనవల్ల భక్తుడు ఆ విగ్రహంలో భగవంతుడి ఉనికిని అనుభవిస్తాడు, తన భక్తినంతా ఆ భగవంతుడికి సమర్పణ చేస్తాడు. ఇంద్రియలోలుడైన ఆధునిక మానవుడు అత్యంతసుందరమైన, కాంతివంతమైన విగ్రహాలలో దైవత్వాన్ని దర్శించకుండా అజ్ఞానం అతడి దృష్టిని కప్పివేస్తుంది. ఈ శతాబ్దంలో ఆవిష్కారం ఐన శాస్త్రీయ పురోగతులే విగ్రహారాధన ప్రాశస్త్యాన్ని అర్థం చేసుకోవడానికి, విశ్వసించడానికి నిదర్శనాలు. ఉదాహరణకు రేడియో తీసుకోండి. ఈ చిన్న పెట్టెలో ఎందరో గాయకులు, నాయకులు బందీ కాలేదా? ఇది కొన్ని నిర్జీవ వస్తువులతో తయారు చేసిన వస్తువు, విసరివేస్తే ముక్కలౌతుంది. దాన్ని సద్వినియోగం చేస్తే కొన్ని వేలమైళ్ళ దూరంలో గానంచేసే గాయకుల పాటలను, ఈ ప్రపంచంలో ఏ మూలనో ఒక మహాత్ముడు చేసే ప్రవచనాలనువినవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా మానవాళి ధ్వని తరంగాలను రేడియో ద్వారా గ్రహించిన విధంగానే, సర్వవాపి ఐన భగవంతుడితో విగ్రహంద్వారా సంబంధం ఏర్పర్చుకోగలం. సర్వాంతర్యామియైన భగవంతుడి దివ్యత్వం ఈ సృష్టిలోని ప్రతి అణువులో ప్రతిధ్వనిస్తుంది. ఈ సమస్త విశ్వంలో భగవంతుడు లేని రేణువు లేదు. విగ్రహాలలో భగవంతుడు లేడని ఎందుకంటారు?

"భగవంతుడు నిరాకారుడు, సర్వవ్యాపి. విగ్రహానికే కట్టుబడి ఎలా వుంటాడు?" అని కొందరు చులకనగా మాట్లాడుతారు. భగవంతుడి సర్వవ్యాపకత్వాన్ని వారు అనుభవిస్తున్నారా?

**మనం దైవ సృష్టి - ధనం మానవ సృష్టి**

అన్నిటిలోను భగవంతుణ్ణి దర్శిస్తున్నారా? లేదు. వారి అహంకారమే వారిని విగ్రహాలముందు తలవంచకుండా చేస్తుంది. ఆ కారణంగా వారు ఈ కుంటిసాకులు చెబుతారు.

ఖాళీబిందెలు ఎక్కువ శబ్దం చేస్తాయి. ధ్యానం, ఆరాధన చేసే వ్యక్తి, సంపూర్ణ జ్ఞానం, నిజమైన భక్తి వుండే భక్తుడు నిరంతరం మౌనం పాటిస్తాడు. తన మౌనం ద్వారానే ఇతరులను ప్రభావితం చేస్తాడు. వారికి జ్ఞానబోధన చేస్తారు. ఆరాధనా దశలో ధారణ చేయడానికి విగ్రహం అవసరమా లేదా అన్న విషయం అతడే స్వయంగా తెలుసుకుంటాడు.

ఎంతటి తెలివిగలవాడైనా ఆరాధనదశలో ఏదైనా చిహ్నం ఆధారం లేనిదే మనస్సును ఏకాగ్రత పరచలేడు. ఒక బుద్ధిమంతుడు, జ్ఞాని "నాకు మూర్తి అంటే ఇష్టం లేదు. నేను సాకారరూపంపై ధారణచేయడానికి ఇష్టపడను" అని అంటే అది అతడి గర్వం, అహంకారం వల్లనే అని అర్థం చేసుకోవాలి. నిరాకారబ్రహ్మాన్ని అతడు ధారణ చేయలేడు. తానొక సాకార రూపంపై ధ్యానం చేస్తున్నానని తెలిస్తే ఇతరులు నవ్విపోతారని అతడి భయం. సాకారరూపం ధ్యానం చేయడు, నిరాకార రూపాన్ని ధ్యానం చేయలేడు. తన జీవితమంతా వాగ్వివాదాలతో, అనవసరమైన తర్కాలతో వ్యర్థపరుస్తాడు. **టన్నులకొద్దీ అధ్యయనాలకన్నా ఒక ఔన్సు ఆచరణ చాలాగొప్పది.** చాలామంది తెలివిగలవారికి వారి తెలివే ఒక గొప్ప అవరోధం. బ్రహ్మం ఉనికి ఊహాగానమనీ, సమాధిఅవస్థ ఒక మనోవికారమనీ, ఆత్మసాక్షాత్కారం వేదాంతుల కల్పన అని వాదిస్తారు. వీరంతా అజ్ఞానంలో కూరుకు పోయిన మాయామోహితులు. వీళ్ళంతా ఆత్మజ్ఞానం ముందు పొల్లులాంటిదైన ప్రాపంచికజ్ఞానప్రవాహంలో కొట్టుకుపోతున్న వారే. ఇటువంటి వారికి ముక్తి కలుగదు. ముందు సత్సంగం ద్వారా వీరి చెడుసంస్కారాలన్నీ నశించి మంచి సంస్కారాలు కలగాలి. అప్పుడే వారు తమ తప్పులను అర్థం చేసుకోగలరు. భగవంతుడు వీరికి స్వచ్ఛమైన గ్రహణశక్తిని, నిజమైన జ్ఞానం పట్ల తృష్ణను ప్రసాదించుగాక!

## భగవంతుడి చిహ్నం

ప్రతిమ ఒక ప్రత్యామ్నాయం, ఒక ప్రతీక. దేవాలయంలో వుండే విగ్రహం రాతితో తయారుచేసినా, కర్రతో తయారుచేసినా, లోహంతో తయారుచేసినా, భక్తుడికి అది అమూల్యమైంది. అది భగవంతుడి ప్రతీక, భక్తుడి దృష్టిలో అతి పవిత్రం, శాశ్వతం. జాతీయపతాకం రంగు గుడ్డతో తయారు చేసినా అది చాలా ప్రియమైంది. దాన్ని రక్షించడానికి ప్రాణాలు కూడా అర్పిస్తారు. అదే విధంగా మూర్తి కూడా భక్తుడికి చాలా ప్రియమైంది. ఆ

మూర్తి భక్తుడితో భక్తిభాషలో మాట్లాడుతుంది. జాతీయ పతాకం సైనికుడిలో శౌర్యం ఎలాకలుగజేస్తుందో, అదేవిధంగా ఓ దేవతామూర్తి భక్తుడిలో భక్తిని కలుగజేస్తుంది. ఆ విగ్రహంపై భగవంతుణ్ణి ఆచ్ఛాదింపజేస్తాడు. ఆ విగ్రహం భక్తుడిలో దివ్యమైన ఆలోచనలను జాగృతం చేస్తుంది.

మామూలు తెల్లకాగితానికి కాని, రంగుకాగితానికి కాని విలువ ఉండదు. కాని అది ప్రభుత్వపు ముద్ర వున్న కరెన్సీ నోటు అయితే దాన్ని జాగ్రత్తగా పర్సులోనో, ట్రంకులోనో దాచిపెడతాము. అదేవిధంగా మామూలు రాతిముక్కకు ఎలాంటి విలువ లేదు, దాన్ని పారవేస్తాము. అయితే, పండరిపూర్‌లో శ్రీకృష్ణుడి శిలావిగ్రహాన్ని చూసినా, మరో దేవాలయంలో భగవంతుడి విగ్రహాన్ని దర్శించినా చేతులు జోడిస్తాము, శిరస్సువంచి నమస్కరిస్తాము. ఆ విగ్రహంలో భగవంతుడి స్వరూపం వుంది. భక్తుడు ఆ శిలా విగ్రహంలో భగవంతుణ్ణి అతడి సర్వగుణాలను ప్రతిష్ఠించుకుంటాడు, దాన్ని పూజిస్తాడు.

నీవు ఒక విగ్రహానికి పూజ చేస్తూ "ఈ మూర్తి జయపూర్ నుండి వచ్చింది. దీనిని ప్రభుసింగ్ అనే వ్యక్తి కొన్నాడు. తెల్ల పాలరాతితో చేసిన ఈ విగ్రహం బరువు 50 పౌన్లు, ధర రూ. 500=00" అని ఎన్నడూ ఆలోచించవు. ఆ విగ్రహంలో భగవంతుడి గుణాలన్నింటినీ ప్రతిష్ఠించి, "ఓ అంతర్యామీ! నీవు సర్వవ్యాపివి, సర్వశక్తిమంతుడవు, సర్వజ్ఞుడవు, దయా మయుడవు అన్నిటికీ మూలం నీవే. నీవు స్వయం అస్తిత్వంగల వాడివి. నీవు సత్, చిత్, ఆనంద స్వరూపుడవు. ఓ నా అంతరాత్మా! నాకు కాంతినీ, జ్ఞానాన్ని ప్రసాదించు! నన్ను సదా నీలోనే వుండనీ" అని ప్రార్థిస్తావు. నీ భక్తి, నీ ధ్యానం తీవ్రతరమై, గంభీరం అయినప్పుడు నీవు శిలావిగ్రహాన్ని చూడవు. చైతన్య స్వరూపుడైన భగవంతుణ్ణే దర్శిస్తావు. నూతనసాధకులకు విగ్రహారాధన చాలా అవసరం.

*(సశేషం)*

**క్రమశిక్షణతో నిన్ను నీవు స్వాధీన పరచుకో! నీ మనస్సు పైన, నీలో చెలరేగే అనుచిత కోర్కెల పైనా విజయమును సాధించు. ధారణ మరియు ఆంతరిక ధ్యానముల పైనా స్థిరత్వమును నిలుపుకో. ఇంతకు మించిన గొప్ప గురు సేవగాని, గురు భక్తిగాని, గురు దక్షిణ గాని లేనే లేవు.**

– స్వామి చిదానంద

**ధర్మము యొక్క నిజమైన అర్థం "ధారణ" (ఆచరణ)**

# భావ పరిణతి

## మనస్సు - సమత్వం

మూలం : స్వామి దయానంద సరస్వతి    సేకరణ : స్వామి సర్వవిదానంద

*(గత సంచిక తరువాయి)*

## ప్రసాదము

భగవానుడు బోధిస్తాడు – "కర్మఫలానికి నీవు కర్తవు కావు. నేను దానికి హేతువును–కర్తను". భగవానుడి నుండి వస్తున్నది కాబట్టి కర్మ ఫలం – ఎక్కువ, తక్కువ సమానం లేక విరుద్ధం ఏదైనా కావచ్చు – అది ప్రసాదమవుతుంది. ఆ విధంగా కర్మఫలాన్ని భగవానుడి నుండి వచ్చింది కాబట్టి ప్రసాదంగా చూస్తారు. ఇదీ కర్మఫలం దృష్ట్యా సమచిత్తత్త్వం. సమ చిత్తత్త్వం అవగాహన నుండి పుడుతుంది. గానీ ఎవరి పైనా బలవంతంగా రుద్దలేము. ఎప్పుడైనా సరే అది సత్యం గురించిన కొంత జ్ఞానం నుండే కలగాలి. అందుచేతనే నేను చెప్తున్నాను. మనం కర్మలకు కర్తలమన్న నిజానికి, భగవానుడు కర్మ ఫలదాత అన్న నిజానికి జీవించాలి. కనుక, నేనాశించినది లభించక పోయినప్పటికి నేనా ఫలాన్ని మొదట స్వీకరిస్తాను. విశేషంగా పెరిగి ఇంకా అధికంగా కృషి చేస్తాను. అనుతాపం లేదు.

తరచుగా నన్నీ ప్రశ్న నడుగుతుంటారు. – 'స్వామీజీ! ప్రతిది ప్రసాదంగా స్వీకరిస్తే తల ఊపేవాని గానూ, లొంగిపోయే వాని గాను కానా?' ఇక్కడ మిమ్ముల నడగాలి, ప్రసాదంగా స్వీకరించకపోతే ఏ విధంగా స్వీకరిస్తావు?' సంతోషంగా ప్రసన్నంగా ఫలితాన్ని స్వీకరించకపోతే, దాన్ని అనుతాపంతోను, భంగపాటుతోను, నిరాశా నిస్పృహలతోను స్వీకరిస్తావు. అది ఏ విధంగా నిన్ను ఉత్సాహవంతునిగా క్రియాశీలునిగా చేస్తుంది? పరిస్థితిని ప్రసాదంగా స్వీకరించటం మనిషిని లొంగిపోయే వానిగా చేస్తుందనుకోవటం సరికాదు. నిజానికి, పరిస్థితి ప్రసాదంగా స్వీకరించినప్పుడు మాత్రమే నీవింకా ఉత్సాహవంతుడవు, క్రీయాశీలుడవు అవుతావు. అప్పుడే నీవు ఫలితాన్ని యధాతథంగా స్వీకరించి ముందుకు సాగగలవు. "అయ్యా! నౌక మునిగిపోయింది!", "అయితే ఏం" అదీ ప్రసాదం. ప్రసాద బుద్ధితో వ్యక్తి వికాసం పెరుగుతుంది. – వివేక జ్ఞానం పెరుగుతుంది.

**పేరు ప్రతిష్ఠల త్యాగమే గొప్ప త్యాగము**

నీ మిత్రుడు వివాహం చేసుకుంటున్నాడనుకుందాం. ఆ ఉత్సాహంతో ఆహ్వానితులకు స్వాగతం పలికే బాధ్యత నీకప్పగించారనుకుందాం. ప్రవేశ ద్వారం దగ్గర నిలబడతావు. మండపంలో వచ్చే వారికి స్వాగతం పలుకుతుంటావు. నీకు పరిచయమున్నా లేకపోయినా వచ్చే అతిథులందరినీ చిరునవ్వుతో ఆహ్వానిస్తావు. అతిథిగా ఆ సమయంలో నీ మిత్రుడు వచ్చినా అతడిని కూడా ఆహ్వానించి ముందుకు వెళ్ళమని చెప్తావు. అతడితో మాట్లాడే సమయముండదు. ఇతర అతిథులు కూడ వస్తున్నారు. వారిని కూడ నీ వాహ్వానించాలి. మరిప్పుడు నీ బద్ధశత్రువు వస్తున్నాడు. అతడినేవిధంగా చూస్తావు ? ఇప్పుడు నీవు నీ మిత్రునికి ప్రతినిధిగా పనిచేస్తున్నా వన్న సంగతి గుర్తుంచుకోవాలి. కాబట్టి నీ వ్యక్తిగత రాగద్వేషాలు వ్యక్తం కారాదు. కనుక ఏదో విధంగా చిరునవ్వు తెచ్చుకుని నీ మిత్రునెలా ఆహ్వానించావో అదే విధంగా ఈ మనిషిని కూడా ఆహ్వానిస్తావు. ఇదీ సమత్వం. నీ జీవితమంతా నేర్చుకునే ఒక అనుభవమే.

## ఓటమన్నది లేదు

ప్రతివారు అల్పజ్ఞులే, అల్పశక్తిమంతులే. కనుక ప్రతివారూ ఓటమితోనే జన్మించారు. రహదారి దాటి ఆవలివైపు క్షేమంగానే చేరగలవని కూడా ఖచ్చితంగా చెప్పలేవు. రహదారి దాటుతుండగానే ఒక లారీ పై నుండి పోవచ్చు. లేక ఆటోరిక్షా ఢీకొనవచ్చు. దుర్ఘటనలు ఇతరులకే జరుగుతాయని మనమనుకుంటాం. మనకు కూడా జరగవచ్చు. అల్పజ్ఞానం నుండి, అల్పశక్తి నుండి జనించిన ఈ అనిశ్చితత్త్వం జీవితంలో ప్రతి రంగానికి వర్తిస్తుంది. నీ జ్ఞాన మల్పం కనుక, శక్తి సామర్థ్యాలల్పం కనుక, నీవు చేపట్టిన పనిలో నీవాశించింది లభించకుండా ఉండే అవకాశాలే ఎక్కువ.

భవిష్యత్తు గురించిన నీ అంచనాలేవైనా అవి నీ ప్రస్తుత జ్ఞానం మీద ఆధారపడి ఉంటాయి. ఒడిదుడుకులు నన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఎంతో పకడ్బందీగా జరుగబోయే వాటి గురించి అంచనాలు వేస్తావు. ఈ మధ్యకాలంలో నీవనుకోనివి, ఊహించనివి అనేకం జరుగవచ్చు. కనుక నీ అంచనాలన్నీ ఫలిస్తాయని, తారుమారుకావని ఖచ్చితంగా చెప్పలేవు. ముందు ముందు ఇలా జరగాలి. – కావాలి అనే అంచనా ఒక ఆశ మాత్రమే. దానికి ప్రార్థనను జోడించి ప్రార్థనా యుక్తమైన ఆశగా చేయవచ్చు. ఖచ్చితంగా చెప్పగలిగేదేదీ లేదు. గర్వించదగిన దేదీ లేదు. నేను ప్రవచనం చేస్తున్నా గూడా, ఈ ప్రవచనాలన్నీ అనుకున్నట్లుగా సమాప్తం చేయగలనన్న ఖచ్చితమేమీ లేదు. ఏదైనా, ఎవరికైనా, ఎప్పుడైనా

**మంచి ఆలోచనలు తరగని సంపదలు**

జరగవచ్చు. కనుక ఏ అంచనా అయినా సరే ఖచ్చితం గాదని మనం తెలుసుకోవటం మంచిది. అంచనా వేసేటప్పుడు అది మనుకున్న విషయాల మీద సమాచారం మీద ఆధారపడిన ఆశ మాత్రమే అవుతుంది. ఆ సమాచారం సమగ్రమైనదెన్నటికి కాజాలదు. కేవలం సర్వజ్ఞుడైన వానికి మాత్రమే ఏం జరగబోతున్నదో ఖచ్చితంగా తెలుసు. కనుక భవిష్యత్తు ఆధీనంలో ఉన్నదేదైనా ఊహాత్మకమే – ఒక ఆశ మాత్రమే.

అలాగా ప్రతి వారు జన్మతః నష్టపోయే వారే. కానీ, అదలా ఉండగా, నిన్ను నీ వొక్కసారి చూసుకో. నీవు జయం పొందిన వాడివే. నిన్ను చూస్తే ఎంతో అనుగ్రహం పొందుతున్న వానిగానే అనిపిస్తుంది. ఎలాగంటే నీవెప్పుడనుకుంటే అప్పుడు నోరు తెరవగలుగుతున్నావు. రకరకాలుగా తింటూనే ఉంటావు. అయినా జీవించే ఉన్నావు. అంటే పరమేశ్వరుడు మనయందున్నాడని స్పష్టమవుతున్నది. ఇన్ని సంవత్సరాలు నేను తిరుగుతున్నాను. మాట్లాడుతున్నాను. వింటున్నాను. జీర్ణించుకుంటున్నాను. భారతదేశంలో ఉన్న పారిశుధ్య తీరుతెన్నులు చూస్తే ఇంకా మనం మనగలుగుతున్నామన్న విషయం అత్యంత ఆశ్చర్యకరమైనది. ప్రతి దినమొక అనుగ్రహమే మనకు. ఉదయం నిద్రలేవగానే – ‘ఆ! మరో రోజు’ – అని సంతోషంగా చప్పట్లు కొట్టుకోవాలి. ప్రతిరోజు అనుగ్రహింపబడిన రోజు ఎందుకంటే నిద్ర లేస్తామని నిశ్చయంగా చెప్ప గలిగిన కారణం లేదు. కనుక ఆ భేదాన్ని చూపేదేదో ఒకటి అతీతమైనదున్నదనే వివేకానికి సూచకమా చప్పట్లు. నేనెప్పుడూ జయిస్తున్నానే అనిపిస్తుంది. ఎవ్వరూ ఓడిపోరు. నీవు నిశ్వసించినప్పుడు బయటకు వదిలిన గాలి తిరిగి లోపలికి వస్తుందన్న నిశ్చయమెక్కడ? గుండె కొట్టుకుంటోంది. – లబ్ – డబ్, లబ్ – డబ్. లబ్‌కి డబ్‌కి మధ్య వ్యవధానమున్నది. అనుగ్రహమంతా, ఈ వ్యవధానంలో ప్రవహిస్తున్నది. ఏదో అనుగ్రహాన్నే సర్వవేళలా చూస్తున్నాను. ఇక్కడే మనం మానసిక రుగ్మతల నుండి వెలువడగలం. నాకున్నవి అల్పజ్ఞానము అల్పశక్తియుక్తులైనప్పటికి, అనుగ్రహబలంతో విజయవంతుడనవుతున్నానని గుర్తించినప్పుడు నేను పరిణతిపొందిన వాడనవుతాను. గెలుపు, ఓటములను వేరు పరచేది, తారుమారుచేసేది మరొకటేదో ఉన్నదనే గుర్తింపు నాకుంటే నేను పరిణతి పొందిన వాడనవుతాను. సర్వాతీతమైన దొకటుందని గుర్తించిన వానిని ధార్మికుడంటాము. ఎవరికైతే అదే సత్యమవుతుందో అతడిని – ఆమెను ఆధ్యాత్మిక జ్ఞాని అనంటాము. ఇద్దరూ పరిణతి చెందిన వారే – పరిణతిలో దశలుంటాయి. పరిణతిని మించి మరేమీ లేదు.

వైవాహిక జీవితం సరిగా లేకపోతే, వ్యాపారం కలిసిరాకపోతే తాను ఓడిపోయాననుకుంటాడు మానవుడు. అది పరిణతి లేని నిర్ణయమంటాను నేను. నిన్ను నీవు చూసుకుంటే

**మంచి పనులు వెంటనే చేయి, కాలం నీకోసం ఆగదు**

ప్రతి విషయంలోనూ సిద్ధి పొందిన వాడివే. కళ్ళు తెరి చూడగలుగుతున్నావు. మరి, అలా ఎందుకుండాలి ? ఏ క్షణంలోనైనా కంటిలో వైకల్యమేర్పడవచ్చు. ఎప్పుడు కావాలంటే అప్పుడు చేయి పైకెత్తగలుగుతున్నావు. అలా జరాగలన్న నియమమేమీ లేదు. అందులో రక్తప్రసారణ ఆగిపోవచ్చు. ఇది భావావేశ పూరిత తర్కం కాదు. నీ జీవితాన్ని నడిపే దొకటుందని నీవు గుర్తించాలని కోరుతున్నాను. ఒక శక్తి, ఒక నియతి నీ మనుగడ కాధారమవుతున్నది. నిన్ను క్రియాశీలునిగా చేస్తున్నది. భక్తుడు అదృష్టము, దైవానుగ్రహమంటాడు. నీవు కర్మఫలమనవచ్చు. పూర్వం నీవాచరించిన కర్మలకవి ఫలములు – నీ వార్జించుకున్నవి. కానీ, ఏ కర్మ ఈ విశిష్ట ఫలాన్నిస్తున్నదో నీకు తెలియదు. ఏ విశిష్ట కర్మ ఈ పరిస్థితికి కారణమో మనం చెప్పలేనప్పుడు – దాన్ని అదృష్టము, అనుగ్రహ మంటుంటాం. ఉదాహరణకు, ఒక సంఘటన జరగటానికి కారణం మనకు తెలియనపుడు దాన్ని, దుర్ఘటన అంటాము. కానీ కారణం తెలిసినప్పుడు దుర్ఘటన ఒక ఘటనగా మాత్రమే మిగిలిపోతుంది. అదే విధంగా, నేనదృష్టాన్ని, అనుగ్రహాన్ని పొందినప్పుడు, దానికోసం నిస్సందేహంగా కష్టపడ్డాను. – ఇప్పుడు కావచ్చు. లేక గతంలో కావచ్చు. కానీ ఏ విధంగానన్నది చెప్పలేను. అందుచేత దాన్ని అనుగ్రహము – అదృష్టము అనంటాము. అలా అనటం సాదర భావంతో కర్మ ఫలాన్నంగీకరించటం, ఏ కర్మ ఈ ఫలాన్నిచ్చిందో మనకు తెలియదు గనుక.

నీకున్న అల్పజ్ఞానము అల్పశక్తి సామర్థ్యముల వలన ఓడిపోతూనే ఉండి ఉండవలసినది నిజమైనప్పటికి, నీ వెల్లప్పుడూ గెలుపొందుతూనే ఉన్నావన్నది కనుగొటం – ఈ అవగాహన – చాలా ముఖ్యమైనది. అది ఇష్ట అనిష్ట పరిస్థితులు రెండింటిపట్ల ఒక మనోవైఖరిని ఏర్పరుస్తుంది. నీ పరిణతితో అనిష్ట పరిస్థితులను గూడా స్వీకరించగలుగుతావు. ఒక సత్యాన్ని జీర్ణించుకోగల, అంగీకరించగల, దానితో కలిసి ఉండడల సామర్థ్యం, అవగాహన ఉన్నప్పుడే సాధ్యమవుతుంది. ఇష్ట పరిస్థితులెంత సంబద్ధములో అనిష్ట పరిస్థితులు కూడా అంతే సంబద్ధములు.

*(సశేషం)*

**నీలో, సదా – సర్వదా ప్రకాశించుచున్న భగవానుని ఉనికిని అనుభవమొనర్చుకొన దలచిన యెడల, నీలోనే ఉన్న చిన్న "అహంకారమును" రూపుమాపుకో ! నీలోని "అహంకారము"ను రూపు మాపుకొనుటకు "దివ్య జీవన మార్గము"న పయనించుము.**

**సమయాన్ని సఫలం చేసుకునే వారు వివేకవంతులు**

# శ్రీ రమణతత్త్వము

- శ్రీమతి బొప్పన అరుణాదేవి

## ఈశ్వర సాక్షాత్కారము సాధ్యమా ?

జనులందరూ ఒకే విధంగా ప్రవరిస్తారని ఆశించరాదు. అది వాని వాని మనఃప్రవృత్తిని బట్టి, గత జీవితాలను బట్టి ఉంటుంది. భక్తి, జ్ఞాన, కర్మలు మూడు పరస్పరం పెనవైచుకొన్నవే. రూపధ్యానం వాని వాని ఇచ్ఛానుసారం ఉంటుంది. దాని ఉద్దేశ్యం మిగతా రూపాలన్నీ మాని, తానెనుకున్న రూపం ఒక్కదానిపైనే చింతనను లగ్నం చేయవలెనని. అది గమ్యాన్ని చేరుస్తుంది. ఆదిలోనే మనస్సును హృదయంలో స్థిరీకరించటం అసాధ్యం. అందుకే యిన్ని ఉపాయాలు, సాధనాలు,. అసలు నీకు గాని, నాకు గాని, మరెవరికి గాని జన్మే లేదంటాడు శ్రీకృష్ణుడు. ఆ తర్వాత ఆయనే తాను ఆదిత్యునికి పూర్వమే పుట్టి యున్నానన్నాడు. ప్రతివాడూ వాని మనఃపరిణితి క్రమంలోనే దైవాన్ని ఊహిస్తాడు. ఏ విధానాన్ని నీవు అనుసరిస్తావో ఆ విధానాన్ని యోగులు ప్రోత్సహిస్తారు. అది నిన్ను గమ్యానికి చేరుస్తుంది.

కర్మను నిరాకరించిన శ్రుతులే నిష్కామ కర్మ నంగీకరించాయి. అవి అంగీకరింపని కర్మలు కర్తృభావనతో చేసినట్టివి. కర్మలను పరిహరింపకు. అది అసాధ్యం. కర్తను నేనన్న భావనను త్యజించు. కర్మ తాను తానై ప్రవర్తిస్తుంది. కాక తన్ను తానై వీడిపోతుంది. కర్మ నీ ప్రారబ్ధమైతే నీ కిష్టమైనా కాకున్నా చేసే తీరుతావు. కర్మ నీకు వ్రాసి యుండకపోతే నీవెంతగా యత్నించినా అది జరగదు. శుకుడు, జనకుడు అహంకారం లేక కర్మలను ఆచరించారు. కీర్తికై కర్మలను అనుష్ఠించవచ్చు. స్వార్థం వీడి పరహితార్థం వానిని చేయవచ్చు. అప్పుడు కూడా మెప్పుదలకోరే చేస్తారు. కాబట్టి అట్టి కర్మలు నిజంగా స్వార్థానికైనవే.

యోగ వాసిష్ఠంలో చూడాల శిఖధ్వజునికి అహంకార నాశనానికి విచారమార్గం అనుసరించమని బోధిస్తుంది. ప్రాణాయామం, హఠయోగం కన్నా ఆత్మవిచారణ అత్యుత్తమం.

శ్రవణం ఎంతగా చేసినా సత్యానుభవం కలుగలేదని కొందరు పరితపిస్తారు. దానికి కారణం మనస్సులోని కల్మషమే. అజ్ఞానము, సంశయము, మిథ్యాత్మబుద్ధి. ఈ ఆటంకములను తొలగించవలసి ఉంది.

**మనసుని అణచకు, మార్చుకో**

అజ్ఞానం పూర్తిగా తొలగటానికి సత్యప్రవచనం, పూర్తిగా గ్రాహ్యమయ్యేవరకూ పలుమార్లు వినవలెను.

సంశయవిచ్ఛేదానికై విన్నదానిని మళ్ళీ మళ్ళీ మననం చేయాలి. చివరకు బోధ నిశ్చతమై సర్వ సంశయాలు వీడిపోతాయి. అడ్డంకులన్ని అంతరించి, సమాధి కుదురుతుంది. శాంతి వెలుగుతుంది.

అనాత్మను ఆత్మగా భావించే మిథ్యాబుద్ధి తొలగడానికి, చిత్తైకాగ్రతను పెంచుకోవాలి. ఇన్ని సాధించిన తర్వాత శ్రవణ మనన విధి ధ్యాసలను మాననే రాదని ఇవి కేవల గ్రంథ పఠన మాత్రాన లభించవు. అనవరత అభ్యాసంవల్ల మనస్సును నిగ్రహించవలె. ముముక్షువుకు కొద్దిపాటు ప్రోత్సాహమున్నా ఆత్మసిద్ధి కలుగుతుంది. ఏవో చిన్న చిన్న సంశయాలున్నా, గురు ప్రవచనం ఒక మారు వినగానే అవీ తొలగిపోతాయి. తక్షణమే వానికి సమాధిస్థితి వస్తుంది. పూర్వజన్మలలోనే వాడు శ్రవణ, మననాదులను ఆచరించి ఉంటాడు కనుక ఇక వానికి అవి అక్కరలేదు. వాడు కృతోపాసకుడు. అకృతోపాసకునికి ఎన్ని మార్లు విన్నా అతనికి సందేహాలు కలుగుతూనే ఉంటాయి. అందువలన సహజ సమాధిస్థితి కలిగేదాకా శ్రవణ, మనన, నిధి ధ్యాసాదులను అతడు వదలరాదు.

శ్రవణం వల్ల దేహాత్మబుద్ధి మొదలగు భ్రాంతులు తొలగుతాయి. మననంవల్ల జ్ఞానమే ఆత్మ అని ధ్రువపడుతుంది. చిత్తైకాగ్రతవల్ల ఆత్మయే అనంతమని, ఆనందమే అని వ్యక్తమౌతుంది.

చిన్న తనములోనే భగవాన్ ఇళ్ళు వదిలి ఎందుకు వచ్చారు? సంసారం ఆటంకం అనా? శాస్త్రాలన్నీ త్యాగాన్ని భూషిస్తున్నవి. అందువలనా? సంసారమన్నది మనస్సులోనే ఉంది. తాను ప్రపంచాన్ని అని ప్రపంచం ఘోషించలేదు. నిద్రలో అది లేదు కనుక అది అశాశ్వతము. అది నిస్సారము కనుక ఆత్మ దాన్ని అణచివేస్తుంది. సంసారము, ఇళ్ళు వదలి రావటం అన్నది భగవాన్ ప్రారబ్దం అంటున్నారు. ఈ జన్మలో ప్రతివాని జీవితం వాని వాని ప్రారబ్ధం నిశ్చయిస్తుంది. ఎవరి ప్రారబ్ధం వారిదే. సన్న్యాసి కావటం ఒకరి ప్రారబ్ధమయితే, సంసారంలో ఉంటూనే ఆధ్యాత్మిక సాధన చేస్తూ ఆత్మ ప్రాప్తి పొందటం మరొకరి ప్రారబ్ధం కావచ్చు. శ్రద్ధతో కూడిన సాధన ఎన్నడూ వృధా కాదు. దానికి వచ్చే సత్ఫలితాలు తప్పక వస్తాయి.

శ్రీరామకృష్ణులు వివేకానందుని తాకగానే అతడానందస్థితుడైనాడంటే అందులకు కారణం వివేకానందుడు పూర్తి పరిణితుడై యున్నాడు. ఆత్మానుభవానికై అతడు ఎంతగానో

**విజయాన్ని ధనంతో కొనలేము - నిరంతర కృషితో సాధించగలము**

పరితపించి, ఆతురుడై యున్నాడు. పూర్వాంగమంతా పూర్వజన్మలోనే పూర్తి చేసియున్నాడు. అట్టి అనుభవం కేవలం పక్వబుద్ధులకే కలుగుతుంది. యోగ్యత ప్రధానం. శ్రీ రామకృష్ణులందరినీ ఆ ఉద్దేశ్యముతో తాకలేదు. ఆత్మ వారు సృజించేది కాదు. ఆత్మానుభవమూ వారి సృష్టికాదు.

అన్ని శాస్త్రాల ప్రయోజనమూ, మనజుని వెనుతిరిగి తన మూలస్థానాన్ని చేరుకొమ్మనడమే. క్రొత్తగా ఆర్జించవలసింది ఏమీ లేదు. తెచ్చి పెట్టుకున్న వ్యర్థ ఆచరణలను వదలటమే వారికి కర్తవ్యం. ఆత్మలో స్థిరపడితే, అదే ఆనందం.

ముముక్షువుకు మూడు అర్హతలుండాలి. అవి ఇచ్ఛా, భక్తి, శ్రద్ధలు. ఇచ్ఛ అంటే క్షుత్పిపాసాది దేహధర్మాలను, శరీరము ఎడల ఏ మమతా లేకుండా నెరవేర్చటం. ఆహారం తీసుకోవటం తప్పుకాదు. కాని ఇలాగే వుండాలి అనే పట్టు ఉండరాదు. అట్లే ఇతరాలు. నిద్రలో నీవు ఏ ఆహారము తీసుకోవు. నిద్ర నీకు ముక్తినిస్తుందా ? ఏ పని చేయనంత మాత్రాన శక్తి వస్తుందనకోవటం మౌఢ్యం.

ప్రతి పానికి కూడా దాని విశిష్టమైన నైపుణ్యం ఉంటుంది. పక్షులు తమ గూడును నైపుణ్యంగా కట్టుతవి. తుమ్మెద తేనెపట్టును కడుతుంది. చీమలు చెదలు పెద్ద పెద్ద నగరాలే నిర్మిస్తాయి. సాలీడు వలపన్నుతుంది. వాటి నైపుణ్యం ముందు మానవుడి గొప్పతనం ఏముంది? అది దైవేచ్ఛ.

పరమాత్మ నుండి ఈ శరీరం జనించింది. ఆ పరమాత్మ నందే నివసిస్తుంది. అందే నశిస్తుంది. కాని మనం దేహంలోనే ఉన్నట్లు నమ్ముతాం. గనుక, దైవం హృదయంలో వసించుచున్నాము. దాని అర్థం 'లోన చూడు' యని. అంతే.

ప్రపంచాన్ని కరవు కాటకాలు పీడిస్తున్నాయి. అంతా దుఃఖమే ఉంది. మహనీయులు, ప్రజా సేవకులు ఎందరో ఉన్నా ప్రపంచ క్లేశ సమస్యను ఎవ్వరూ పరిష్కరించలేకున్నారేమి? అని ప్రశ్నించేవారికి భగవాన్ జవాబు.

మహాత్ములు సాయపడలేదని నీవెలా అనగలవు? బహిరంగ ఉపన్యాసాలు, శరీర కర్మలూ, వస్తు ప్రదానాలు... మొదలయినవన్నీ మహాత్ముల మౌనానికి సాటిరావు. ఇతరులు చేసేదానికంటే వారే హెచ్చు సాయం చేస్తున్నారు అంటున్నారు రమణ భగవాన్.

బుద్ధుడు అన్ని ప్రశ్నలకు మౌనం సమాధానం. ఆ మౌనాన్ని తప్పుగా వ్యాఖ్యానించి హీనయాన, మహాయాన శాఖలు రెండూ బుద్ధుని నాస్తికుడన్నవి. అతడు నాస్తికుడైతే, నిర్వాణాన్ని, పుట్టు చావులనూ, పునర్జన్మలనూ, ధర్మాన్ని ప్రతిపాదించునా? వారి వ్యాఖ్యాతలెల్లరూ పొరపడ్డారని భగవాన్ అభిప్రాయం.

*(సశేషం)*

**మధుర స్వభావులే మహానుభావులు**

# మన పూర్వీకుల దృక్పథం

ఆంగ్లమూలం - స్వామి చిదానంద                    అనువాదం : తిప్పరాజు కొండలరావు

పరమాత్మ స్వరూపులారా, దివ్యబంధువులారా ! అత్యంత పవిత్రమైన మన భారతదేశపు వైదిక జీవనంలో, సంస్కృతిలో కొన్ని ప్రత్యేకమైన, అతిముఖ్యమైన, అర్థవంతమైన విషయాలున్నాయి. అవే మనవైదిక ధర్మానికి, భారతీయ సంస్కృతికి పునాదిరాళ్లు. ఇవి మన గొప్పదైన వారసత్వంపట్ల, మన సంస్కృతి, సంప్రదాయాలపట్ల మన దృక్పథానికి సరికొత్త జీవం పోస్తాయి.

ఏ చక్షువులతో, ఏ దృష్టి కోణంతో మన పూర్వీకులు మనిషిని, మానవ జీవనాన్ని, ఈ ప్రపంచాన్ని, సమస్త మానవాళిని వీక్షించారు? మన పూర్వీకులు ఈ అపూర్వమైన విషయాలను తరతరాలకు అందించారు. అయితే వీటిని వారు తమ ఊహాగానాల ద్వారా కాని, తర్కంవల్ల కాని అందించలేదు. తమ ప్రత్యక్ష దర్శనం ద్వారా, అంతరంగ చైతన్యంలో కలిగిన అపరోక్షానుభూతి ద్వారా మనకందించి మనల్ని పునీతులను చేశారు. అత్యున్నతమైన ఈ భావలను మనందరం మరచిపోతే మన జీవన ప్రవాహం ఎడారిగా మారుతుంది, ఎండిపోతుంది, శుష్కించి పోయి తన లక్ష్యమైన సముద్రాన్ని చేరకముందే అంతర్ధానమవుతుంది.

మన పూర్వీకుల మూల సిద్ధాంతాలు, వారి దృష్టి కోణం, మన భారతీయ దృక్పథం, మనదైనందిన జీవిత వస్త్రంలో నూలుపోగుగా మారిపోవాలి, మన నిత్య చైతన్యంలో భాగంగా కరిగిపోవాలి. అప్పుడే ఈ ఉన్నత భావాలను మనమందరం సంపూర్ణంగా అర్థంచేసుకొని, జీర్ణించుకొని వాటి ద్వారా లాభం పొందగలం.

ప్రప్రథమంగా దివ్యకాంతిని పొందాలనే తపన, జ్ఞానం సంపాదించాలనే ఆకాంక్ష, మనచుట్టు ఉన్న అంధకారాన్ని త్యజించి ఆ దివ్యకాంతివైపు పయనించాలనే దృష్టికోణం, జీవన విధానమే ఈ మహోన్నత భావాలసారం. అంధకారం బంధిస్తుంది. చూపును పోగొడుతుంది, పురోగతిని ఆపేస్తుంది. మన జ్ఞాన సాధనవైపు జరిగే ఆధ్యాత్మిక ప్రయాణంలో అవాంతరాలను సృష్టిస్తుంది. సమస్త అంధకారానికి అతీతంగా జీవించడమే జీవితం యొక్క అర్థం, పరమార్థం.

**మంచితనాన్ని మించిన సంపద లేదు**

ఈ దివ్యకాంతి మానవ అనుభవంలో కలిగే కాంతి కన్నా, లౌకిక జీవనానుభవంలో ఎదురయ్యే కాంతి కన్నా ఉన్నతమైనది, ప్రశస్తమైనది. అక్కడ సూర్యచంద్రులు, నక్షత్రాలు, మెరుపులు ప్రకాశించవు, ఇక అగ్ని సంగతి సరేసరి. ఆ దివ్యకాంతి, అత్యంత తేజోవంతంగా ప్రకాశిస్తుంది కనుక ఈ ప్రపంచంలోని వస్తువులన్నింటిలో వెలుగు, కాంతి కనపడుతుంది అన్ని వస్తువులు తమలోని వెలుగును ప్రదర్శిస్తాయి. అన్ని వెలుగులు ఆ దివ్యకాంతిలోనే లీనమవుతాయి. ఆ దివ్యకాంతి నుండే తమ వెలుగును సంతరించుకుంటాయి. ఇది మన పూర్వీకులకు కలిగిన అనుభవం. అందుకే అంతిమ సత్యాన్ని లోకాతీత కాంతిగా భావించడం సర్వసామాన్యమై పోయింది. మన సంస్కృతి యొక్క హృదయాన్ని పొందాలనే తపన, జిజ్ఞాస మన సనాతన వైదిక ప్రార్థనలో దర్శనమిస్తుంది.

**"తమ సోమా జ్యోతిర్గమయ"** – అంధకారం నుండి కాంతి వైపు మాకు మార్గదర్శనం చేయి, నడిపించు. అంధకారం నుండి బయటపడాలనీ, దివ్యకాంతి పొందాలనే నిరంతర, అఖండిత భావం, సాధన మీ అందరిలో ఉండాలి. ఆ కాంతిని కోరేవారే సాధకుడు, జిజ్ఞాసువు. జ్ఞానానికి, బుద్ధికి, కాంతికి వ్యతిరేకమైన వాటిని తిరస్కరించి, జీవితంలో వాతావరణంలో ఎదురయ్యే వాటన్నిటినీ త్యజించి, కాంతులకే కాంతి అయిన ఆ దివ్యకాంతిని సాధించే ప్రయత్నంలో కలిగే అవరోధాలను అధిగమించి, జ్ఞానం, బుద్ధి, కాంతి కావాలని తపించే వాడే నిజమైన సాధకుడు, జిజ్ఞాసువు. మీ అందరిలో ఆ దివ్యతత్వం ప్రజ్వరిల్లాలి.

అంతా పవిత్రం, సర్వం అంతరంగంలో ఉంది, సర్వవ్యాపకమై ఉంది. దివ్య సత్యంతో నిండి వున్నది అన్నది మరో గొప్ప భావన. మీరు ఆ గొప్ప సత్యంలో జీవిస్తారు, కదలాడుతారు, వాటిలో మీ అస్తిత్వం మిళితమై ఉంది. మన ఉపనిషత్తుల్లో, భగవద్గీతలో యోగ, వేదాంత మార్గాన్ని ఎంచుకొని, నిరంతరం దీక్షతో సాగిపోయిన మన ఋషి పుంగవుల బోధనలలో ఈ విషయం ప్రస్ఫుటంగా దర్శనమిస్తుంది. ఆ దివ్యత్వంలోనే, ఆ దివ్యత్వం ద్వారానే గొప్ప ప్రదర్శనలు, దృగ్విషయాలు, ప్రాపంచిక దర్శనాలు ఉంటాయి. నిరంతరం మార్పుచెందే, లౌకిక, శూన్య విషయాలలోనే మార్పులేని స్థిరమైన, శాశ్వతమైన తత్వం ఉంది. మన అనుభవంలోకి వచ్చే ప్రతి కదలిక, ప్రతిశక్తి, అన్ని శక్తిరూపాలు, అన్ని శక్తులు, ఆ శాశ్వతసత్యం, కాంతులకే కాంతి అయిన ఆ గొప్ప కాంతి యొక్క ప్రతిరూపమే అన్న విషయం తేటతెల్లమవు తుంది.

ఈ అనుభవం నుండి ఓ నూతన ఆలోచనా స్రవంతి ఉద్భవించింది. దివ్యత్వం సర్వవాప్తమైన సత్యం మాత్రమేకాదు; సర్వాంతర్యామి అయిన అస్తిత్వం మాత్రమే కాదు ;

**సేవించకు మద్యం - జీవితాన్ని చేయునది ఛిద్రం**

అపారమైన సూర్యకాంతులకు మించిన అద్భుతమైన కాంతి మాత్రమే కాదు ; అదొక గొప్ప విశ్వజననీయమైన శక్తి, విశ్వజననీయమైన మూలం. విశ్వంలోని ప్రతి కదలిక, ప్రతిశక్తి, ప్రతి బలం, ప్రతి పరాక్రమం దివ్యమైనవే. అయితే వాటి మూలం ఆ దివ్య మూలశక్తియే, అందుకే అది అతి పవిత్రం. అందుకే దాన్ని అలవర్చుకోవాలి, దాన్ని పెంచుకోవాలి. దానిని సేకరించాలి, దానిని సంరక్షించుకోవాలి. ఆ తర్వాత ఏదైనా సాధ్యమే. దేనిని అధిగమించాలో దానిని అధిగమించగలం. దేనిని సాధించాలో దేనిని పొందాలో అది సాధ్యమవుతుంది. ఏదీ అసాధ్యం కాదు. స్థూల లౌకిక విశ్వ శక్తుల వెనక ఆ దివ్యమైన మూలం, దివ్యమైన శక్తి ఉంది. అదే పరాశక్తి.

శాక్తేయం అనే తత్త్వం శాశ్వత సత్యాన్ని అనంతమైనదిగా, అంచనాలకు అతీతమైన శక్తిగా గుర్తించింది. ఆ సత్యాన్ని పరాశక్తి అనీ, ఆది శక్తి అనీ, మహాశక్తి అనీ అద్భుతమైన పారమార్థిక శక్తి అనీ నిర్వచించింది. సమస్తం ఆ శక్తితో నిండిపోయిందనీ భావించింది. మీరు ఈ ప్రాంతఃకాల సమయంలో ఇక్కడ కూర్చున్నారంటే ఆ శక్తియే మీ హృదయం స్పందించేలా, మీ భౌతిక శరీరంలో రక్తప్రసరణ జరిగేలా చేస్తుంది. ఆ శక్తియే మీ శ్వాస ఆడేలా మీరు సేవించిన ఆహారం జీర్ణమయ్యేలా, మిమ్మల్ని జీవిస్తున్న, నడయాడుతున్న చైతన్యవంతమైన అస్తిత్వంలా, మీరు, మీరుగా ఉండేలా చేస్తుంది. (ఆహారం సేవించినంతమాత్రాననే శక్తి కలుగదు. ఆ గొప్ప శక్తి మీరు జీవించేలా చేస్తుంది, ఆ క్రమంలో శరీరంలో పెరుగుదల, తరుగుదల జరుగుతుంది. అందుకే ఆహారం తీసుకోవడం అవసరం). ఆ శక్తివల్లనే ధాన్యం బలాన్ని చేకూరుస్తుంది, నీరు దప్పిక తీరుస్తుంది. అగ్ని ఆహారాన్ని వండుతుంది. ఆ శక్తియే నా పలుకులుగా వస్తుంది. ఆ శక్తియే నా పలుకులు మీ చెవుల వరకు చేరేలా, వాటిని వినేలా చేస్తుంది. మీరు అన్ని విషయాలను అర్థం చేసుకునేలా, వాటిని జీర్ణించుకునేలా, వాటికి తగిన వ్యాఖ్యానాన్ని అందించేలా ఆ శక్తి మీ బుద్ధిలా పనిచేస్తుంది. – "యా దేవీ సర్వభూతేషు బుద్ధి రూపేణ సంస్థితా" (అన్ని జీవరాసుల్లో బుద్ధి రూపంలో ఉన్న దేవత).

అందువల్ల ఓ జిజ్ఞాసువు, ఓ సాధకుడు, ఓ యోగి తనకు అందుబాటులో ఉన్న అన్ని శక్తులను, బలాలను, ఎంతో గౌరవిస్తాడు. అమితమైన గౌరవంతో, అవగాహనతో, సంయమనంతో, స్వయం నియంత్రణతో, సాధనతో, తపస్సుతో యోగి ఈ శక్తిని అలవర్చుకుంటాడు. నిజమైన యోగి ఈ శక్తిని పొంది, పెంచుకొని, తెలివిగా జాగ్రత్తగా

**ఎక్కువ కోరికలే సమస్యలకు మూలం**

దాచుకుంటాడు. యోగ సాధన ద్వారా సాధించిన నైపుణ్యంతో తాను పొందిన శక్తిని నిర్మాణాత్మక, సకారాత్మక, అభ్యుదయ కార్యక్రమాలకు యోగ మార్గంలో పయనించడానికి వినియోగిస్తాడు. అంతిమంలో ఈ విశ్వజననీయ శక్తి మిమ్మల్ని యోగిగా తయారుచేస్తుంది. మీరు పరోపకారి అయితే ఈ విశ్వజనీయ శక్తియే మీ చేత నిస్వార్థ, అహంకార రహిత, ఉద్దేశ్య రహిత, రాగరహిత కార్యక్రమాలను చేయించి మిమ్మల్ని కర్మయోగిగా మారుస్తుంది. ప్రతిదినం ఈ విషయాన్ని గుర్తుంచుకొని, మీరు ఇతరులకు సహాయ సహకారాలు అందించేలా, సేవచేసే అవకాశం కల్పించినందుకు ఆ శక్తికి కృతజ్ఞతలు సమర్పించుకోవాలి.

ఆ శక్తియే మీలోని ప్రాణశక్తి. ఆ శక్తియే మీలో ఉన్న కుండలినీ శక్తి. మీరు పఠించే ప్రతి మంత్రంలో, మీరు ధ్యానించే ప్రతి దివ్యనామములో బలాన్ని, సామర్థ్యాన్ని నింపుతుంది. మీకు శారీరక, మానసిక, బౌద్ధిక, నైతిక, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది ఆ శక్తి. అన్ని స్థాయిలలో ఆ శక్తి తన లీలలను ప్రదర్శిస్తుంది. మీరు ప్రార్థన చేసినప్పుడు ఆ ప్రార్థనలో ప్రాణాన్ని నింపి, ఆధ్యాత్మిక చైతన్యాన్ని కలిగిస్తుంది ఆ శక్తి. ఆ శక్తియే గాయత్రి. ప్రతి నామం, ప్రతి మంత్రం ఆ శక్తియే. సమస్త స్థూల విశ్వంలోని చైతన్యం, సంపూర్ణ సృష్టి ఈ దృగ్విషయ ప్రపంచం, మీరు కూడా ఆ శక్తిలోని భాగమే. అదంతా సమస్త శక్తులకే అయిన ఆ శక్తి యొక్క లీలలే.

అందుకే అన్ని విషయాల పట్ల పవిత్రత ; అన్ని శక్తుల, అన్ని సామర్థ్యాల, అన్ని బలాల పట్ల గౌరవ భావం కలిగి ఉండాలి. శ్రద్ధాసక్తులతో ఆరాధనా భావాన్ని పెంచుకోవాలి. ఈ శక్తిని వృథాచేయవద్దు, దురుపయోగం చేయవద్దు ; మీ జీవితంలో వెలుగొందుతూ, మీ జీవనాన్ని ఉన్నత స్థాయికి చేర్చడానికి మీలో ప్రత్యక్షంగా విరాజమానమై ఉన్న పరమాత్మ సంకల్పానికి వ్యతిరేకంగా ఈ శక్తిని వినియోగించకుండా సంపూర్ణ శ్రద్ధతో ప్రయత్నం చేయాలి. దివ్యసంపూర్ణత్వానికి ఎదగడానికి భగవంతుడు మనను సృష్టించాడు. మనకు అందుబాటులో ఉన్న పవిత్రమైన శక్తులను వ్యర్థం చేసినా, దురపయోగం చేసినా, మన జీవితాలపట్ల పరమాత్మ చేసిన సంకల్పం రద్దు అయిపోతుంది. మన అస్తిత్వాన్ని, మన ప్రగతిని మనమే అడ్డుకున్నట్లు అవుతుంది. మన జీవన వికాసం, మన అస్తిత్వ ప్రగతి ఆగిపోతుంది.

ఒక దృష్టిలో పరికిస్తే మన చుట్టు ఉన్నదంతా స్థూలంగా అడ్డుపడ్డా, మరో దృక్పథంలో అంతా దివ్యమైనదే. అన్ని జీవితాలు అతి పవిత్రమైనవే. ప్రతి విషయాన్ని గౌరవంతో, పవిత్రంగా చూడాలి. ప్రతి విషయాన్ని మన సంపూర్ణత్వ స్థాయికి చేరే అవకాశంగా భావించాలి.

**అసాధ్యాన్ని సుసాధ్యం చేయుటయే ఉత్తమ లక్షణం**

మీలో, మీ చుట్టు ఉన్న విశ్వంలో, అన్ని గొప్ప తత్త్వాలలో, ఆసనాలలో, ప్రాణాయామంలో, సత్సంగంలో పలికే ప్రతి పలుకులో, జపంలో, ధ్యానంలో, ప్రపంచంలో వ్యాప్తమై ఉన్న అన్ని శక్తులకు, సామర్థ్యాలకే మూలం అయిన ఆ గొప్ప మూలశక్తిపట్ల అత్యంత ఆరాధనా భావం, గౌరవభావం కలిగి ఉండాలి. ఆ శక్తిని పూజించే పూజారిగా ఎదగాలి. అత్యంత గౌరవభావంతో ఆ శక్తి పట్ల శ్రద్ధాసక్తులతో వర్తించాలి. మీ జీవితంలో మీ చట్టు ఉన్న ప్రపంచంలో అందుబాటులో ఉన్న ఆ దివ్యశక్తిని అత్యంత ఉన్నత దృక్పథంతో ఉపయోగించుకొని భగవత్సాక్షాత్కారం, అపరోక్షానుభూతి, ఆత్మసాక్షాత్కారం పొందడానికి ప్రయత్నం చేయాలి. అన్ని శక్తులకే శక్తి అయిన ఆ విశ్వశక్తి మిమ్మల్ని అనుగ్రహించాలి గాక! మీ సాధనలో విజయాన్ని ప్రసాదించుగాక!

*(సశేషం)*

**నీ ప్రసన్నత్వానికి, శాంతికి, పరిపూర్ణత్వానికీ, అడ్డంకుగా నిలచి ఉన్నది. “నీవే" సుమా ! నీవు “నేను - నేను “అని భావించుచున్న ఈ విచిత్ర మానసిక స్థితిని విడువకుండా అంటి పెట్టుకొని, ఉండినందువలనే ఈ సమస్త దుఃఖాలకు, కష్టనష్టాలకు, చింతలకూ కారణభూతుడవగు చున్నావు. నీకు సంప్రాప్తించవలసిన సర్వ మంగళ ప్రయోజనములనూ నీవు పొందవలెనంటే - నీవు నిరంతరమూ భావించే, “నేను - నేను" నుండి విముక్తుడవగుటయే గొప్ప ఉపాయము.**

– స్వామి చిదానంద

సహనం సముద్రం కన్నా పెద్దది

# ద్వాదశాక్షరీ మంత్రం విశిష్టత

- తిప్పరాజు గోపాల్‌రావు

**"ఓం నమోభగవతే వాసుదేవాయ"** – ఇది ద్వాదశాక్షర మహామంత్రం. భాగవత పురాణంలోనూ, విష్ణుపురాణంలోనూ తరచుగా దర్శనమిచ్చే మంత్రం. నిరంతరం ఈ మంత్ర పఠనం సంసార సాగారాన్ని దాటించే నావ. జనన మరణ చక్రం నుండి మనల్ని బంధ విముక్తులను చేసే ఆయుధం. విమోచనాన్ని పొందడానికి ఒక ఆధ్యాత్మిక సిద్ధాంతం. భక్తులకు ముక్తి ప్రదాయిని.

శ్రీకృష్ణభగవానుడే వాసుదేవుడు. సాక్షాత్తు శ్రీమహావిష్ణువు పూర్ణావతారం. వాసుదేవ నామంతో చేసిన ప్రతి మంత్ర పఠనం, శ్రీ మహావిష్ణువు ఆరాధనే. మనం ప్రతి నిత్యంచేసే శ్రీమద్భగవత పారాయణ సమయంలోనూ, శ్రీ విష్ణుసహస్రనామ మంత్ర జపసమయమం లోనూ, త్రికాల సంధ్యల్లో చివరిగా దేవతా నమస్కారం సమయంలోనూ **"ఓం నమో భగవతే వాసుదేవాయ"** అన్న మంత్రాన్ని జపించడం మన సంప్రదాయం, మన సంస్కృతి. "ద్వాదశార్ణోమహామంత్రః ప్రధానో వైష్ణవాగమే" అన్న వాక్యం మనకు అగుపడుపుతున్నా శైవ, వైష్ణవ సంప్రదాయాలకతీతంగా భగవన్నామ స్మరణం చేయడానికి అనువైన మంత్రం ఈ ద్వాదశాక్షరి.

శ్రీ మహా భాగవత పురాణంలోని ధ్రువోపాఖ్యానంలో ఈ మంత్రం యొక్క ప్రాశస్త్యం వివరంగా కనపడుతుంది. ఉత్తానపాద మహారాజుకు ఇరువురు భార్యలు, సునీతి, సురుచి, పెద్ద భార్య సునీతి కుమారుడు ధ్రువుడు, చిన్న భార్య సునీతి కొడుకు ఉత్తముడు. మహారాజుకు రెండవ భార్యపై మక్కువ ఎక్కువ. దాని కారణంగా పట్టపురాణి సునీతికి కాని, ధ్రువునికి కాని తగిన గౌరవం, ప్రాధాన్యత లభించేది కాదు. తండ్రి ఒడిలో పినతల్లి కుమారుడు ఉత్తముడు ఆడుకోవడం గమనించిన ధ్రువుడు, తాను కూడా తండ్రి ఒడిలో కూర్చోవాలని వెళితే, సురుచి ఆ పసి బాలునితో "నీవు మహారాజు ఒడిలో కూర్చోవడానికి వీలులేదు. ఆ అర్హత నీకు లేదు. నా కడుపున జన్మనెత్తిన వారికే ఆ స్థానం లభిస్తుందని" ఈసడించింది. ధ్రువుడు తన తండ్రిని వేడుకోగా ; సురుచి అడ్డుపడి "నీకు అంత కోరిగా ఉంటే, తపస్సుచేసి,

**ఆవేశం వివేకాన్ని నశింప చేస్తుంది**

పరమాత్మను ప్రసన్నుని చేసుకొని, నా గర్భంలో జన్మనెత్తేలా వరం పొందు" అంటూ అవహేళన చేసింది.

ఆ పసికందు మనస్సు గాయపడింది. తల్లి దగ్గరకు వెళ్ళి "నేను తపస్సు చేయడానికి అడవులకు వెళ్తున్నాను. ఆ మహావిష్ణువును దర్శించుకొని, వరంపొంది నీకు ఉన్నతస్థానం కలిగేలా చేస్తాను" అంటూ అడవుల దారి పట్టాడు. త్రిలోక సంచారి అయిన నారదమహర్షి ఆ పసిబాలుని సమీపించి "పసిబాలుడా ! ఈ వయస్సులో ఎందుకు నీకింత పట్టుదల ? నీ రాజ్యానికి వెళ్ళి రాజభోగాలు అనుభవిస్తూ జీవించు" అని సలహా ఇచ్చాడు. "స్వామీ! మీరు ఎవరో నాకు తెలియదు. నేను మాత్రం దీర్ఘ తపస్సుచేసి ఆ పరమాత్మ దర్శనం చేసుకుంటాను. నా తల్లికి తగిన గౌరవాన్ని అందిస్తాను. వీలైతే తగిన సహాయం చేయండి" అని ప్రార్థించాడు. ధ్రువుని చెదరని సంకల్పానికి ముగ్ధుడైన నారదుడు", "ధృవకుమరా ! నీకు ఒక మంత్రం ఉపదేశం చేస్తాను. ఆ మంత్ర జపంవల్ల శ్రీ మహావిష్ణువు దర్శనమిస్తాడు. నీ కోరిక నెరవేరుతుంది" అని చెప్పి – **"ఓం నమోభగవతే వాసుదేవాయ"** అన్న ద్వాదశాక్షర మంత్రాన్ని ఉపదేశం చేశాడు. కొన్ని సంవత్సరాలపాటు కఠిన తపస్సుచేసి శ్రీ మహావిష్ణువును సాక్షాత్కారం చేసుకొన్న ధ్రువుడు, ఎన్నో వరాలను పొంది కొన్ని వేల సంవత్సరాల రాజ్యపాలనచేసి చివరకు శ్రీ విష్ణుసాయుజ్యం పొందాడు. శ్రీ మహావిష్ణువు అనుగ్రహంతో ధ్రువమండలానికి అధిపతిగా ధ్రువతారగా కలకాలం నిలిచిపోయాడు. ద్వాదశాక్షరి మంత్ర ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి ధ్రువోపాఖ్యానం ఒక గొప్ప తార్కాణం.

**"ఓం నమోభగవతే వాసుదేవాయ"** అన్న మంత్రంలోని పన్నెండు అక్షరాలకు ఒక్కొక్క పదానికి ఒక ప్రత్యేక శ్లోకము ఉంది. ఈ పన్నెండు శ్లోకాలను, వాటి భావార్థాలను తెలుసుకుందాం. ప్రతి శ్లోకంలోని మొదటి అక్షరాన్ని కలిపి చదివితే ద్వాదశాక్షర మంత్రం దర్శనమిస్తుంది.

**1) ఓం దితో జ్ఞాన వస్త్రేణ రాగానీ కేన నిర్జితః, ।**
**కర్మనిద్రాంప్రపన్నోస్మి త్రాహిమాం మధుసూదనా ॥**

**భావము :** ఓ మధుసూదనా ! నేను అజ్ఞానమనే తడివస్త్రమునే తడిసిన వాడను. రాగాది శత్రువులచే పరాజితుడును. జడమైన కర్మలనెడి నిద్రలో మునిగియున్న వాడను. అట్టి నన్ను రక్షింపుము.

**2) నగతి ర్విద్యతే చాన్యాత్వమేవ శరణం మమ,**
**మాయా పంకేన లిప్తోస్మి త్రాహిమాం మధుసూదనా ॥**

మనకు అవసరాలటు గుర్తున్నంతగా సామర్థ్యాలు గుర్తుండవు

**భావము :** ఓ మధుసూదనా ! నాకు వేరేది దిక్కులేదు. నిన్నే శరణుజొచ్చి ఉన్నాను. మాయా అనే బురదలో దిగబడి యున్నాను. అట్టి నన్ను రక్షింపుము.

**3) మోహితో మోహజాలేన పుత్రదారాగృహాహాదిషు,**
**తృష్ణయా పీడ్య మానోస్మి త్రాహిమాం మధుసూదన ॥**

**భావము :** ఓ మధుసూదనా ! గృహము, భార్య, పుత్రాదుల యందు మోహము అనెడి వలలో చిక్కుకొని ఉన్నాను. అత్యాశచే పీడింపబడుతున్నాను. అట్టి నన్ను రక్షింపుము.

**4) భక్తి హీనంచ దీనంచ దుఃఖశోక సమన్వితమ్ ।**
**అనాశ్రయ మనాథంచ త్రాహిమాం మధుసూదన ॥**

**భావము :** ఓ మధుసూదనా ! నేను భక్తి హీనుడను, దీనుడను. దుఃఖశోకములతో కూడియున్నవాడను. ఆశ్రయ రహితుడను, అనాథను. అట్టి నన్ను రక్షింపుము.

**5) గతాగత పరిశ్రాంతో దూరమధ్వని కర్మణాం,**
**సంసారభయ భీతోస్మి త్రాహిమాం మధుసూదన ॥**

**భావము :** ఓ మధుసూదనా ! కర్మవలయంలో చిక్కుకొని జన్మమృత్యువులనెడి మార్గములలో పరిశ్రాంతుడనై ఉన్నాను. సంసార భయముచే వ్యథ చెంది ఉన్నాను. అట్టి నన్ను రక్షింపుము.

**6) వసితో మాతృగర్భేషు పీడితోహం జనార్దనా,**
**గర్భవాస క్షయకర త్రాహిమాం మధు సూదన ॥**

**భావము :** ఓ జనార్దనా ! మాతృగర్భంలో వసించి ఎన్నో రకముల బాధలచే పీడింపబడిన వాడను. ఓ మధుసూదనా ! ఈ విధమైన గర్భవాస దుఃఖములు లేకుండా నన్ను రక్షింపుము.

**7) తేన దేవ ప్రపన్నోస్మి త్వదాశ్రయ పరాయణ,**
**జరామరణ భీతోస్మి త్రాహిమాం మధు సూదన ॥**

**భావము :** ఓ దేవా ! నీకు నేను ప్రపన్నుడను. నీవే ఆశ్రయ స్థానమని విశ్వసించినవాడను. ఓ మధు సూదనా ! జనన మరణముల వలన భీతి చెందినవాడను. అట్టి నన్ను రక్షింపుము.

**8) వా చాను యత్కృతంపాపం, కర్మణా యదుపార్జితం,**
**తేన దేవ దురాచారం, త్రాహిమాం మధు సూదన ॥**

**భావము :** ఓ మధుసూదనా ! మాటల ద్వారా ఏ పాపములు ఒనరించిచితినో, కర్మల ద్వారా ఏ పాపములు సంపాదించితినో, అట్టి వాటిచే దురాచారుడైన నన్ను రక్షింపుము.

ఆనందం వస్తువులలో ఉండదు - మనసులో ఉంటుంది

**9) సుకృతం నకృతకించి ద్దుష్కృతం చ సదా కృతం,**

**తేనాహం పరితపోస్మి త్రాహిమాం మధుసూదన ॥**

**భావము :** ఓ మధుసూదనా ! కొంచమైనను పుణ్యకార్యములు చేసిన వాడను కాను, ఎల్లప్పుడూ పాపకార్యములనే ఆచరించితిని. ఈ పాపములచేత పశ్చాత్తాపము చెందియున్నాను. ఇట్టి నన్ను రక్షింపుము.

**10) దేహాంతర సహస్రేషు కుయోని సేవితా మయా,**

**తిర్యక్త్యం మను జత్వంచ త్రాహిమాం మధుసూదన ॥**

**భావము :** ఓ మధుసూదనా ! వేల కొలది జన్మలో పశపక్ష్యాదులయందును, మానవులయందును అనేక అథమ జన్మలెత్తియున్నాను. అట్టి నన్నురక్షింపుము.

**11) వాసుదేవ, హృషీకేశ, వైకుంఠపురుషోత్తమ,**

**సృష్టి సంహార కారస్త్వం త్రాహిమాం మధుసూదన ।**

**భావము :** ఓ వాసుదేవా ! హృషీకేశా ! వైకుంఠవాసా ! పురుషోత్తమా ! నీవు సృష్టి, స్థితి సంహారకారడవు. కావున మధు సూధనా నన్ను రక్షింపుము.

**12) యత్రయత్ర గమిష్యామి నార్యాం వాపురుషేపివా,**

**తత్ర తత్రాస్తుతే భక్తిః త్రాహిమాం మధుసూదన ॥**

**భావము :** ఓ మధుసూదనా ! ఎక్కడెక్కడ నేను స్త్రీ, పురుష రూపములో జన్మించినను అక్కడ ఆయా జన్మములందు నీ యెడల భక్తి నాకు కలుగుగాక ! అట్టి నన్ను రక్షింపుము.

**"ఓం నమోభగవతే వాసుదేవాయ"** అన్న ద్వాదశాక్షర మంత్రం అత్యంత పవిత్రమైనది, శక్తిమంతమైనది, అద్భుతమైనది, మోక్షప్రదాయిని. మనం మన దైనందిన జీవితంలో ఎల్లప్పుడూ ఈ మంత్రాన్ని స్మరిస్తూ, పఠనంచేస్తూ, జపిస్తూ ఉంటే సంసార సాగరాన్ని దాటడం సులభం. మన జీవితాన్ని ప్రశాంతంగా గడపవచ్చును. ఈ మంత్రంలో ప్రతి అక్షరంలోగల సూక్ష్మభావాన్ని గ్రహించి, అర్థం చేసుకొని, ఆచరణలో పెడితే మన జీవితం పరమానందంగా గడుస్తుంది.

✶

**చేయకుండానే చేశాననేవాడు అధముడు, కొద్దిగా చేసి కొండంత చేశానని చెప్పేవాడు దుర్జనుడు, ఎంతో చేసి కొంచెమే చేశానని చెప్పేవాడు సజ్జనుడు**

**ముఖస్తుతి నచ్చే వారికి ఉత్తుత్తి మాటలతోనే కడుపు నిండుతుంది**

# ప్రార్థన

- ఎ. వెంకటస్వామి

బహునామములతోడ పరగెడువాని
బహురూపములతోడ భాసిల్లువాని
నామ రూపములకందక వెల్గువాని
జగముల పుట్టింప, సమయింప, పెంప
శక్తుడై మనకెల్ల జనకుడౌవాని
అణువాదిగా బ్రహ్మాండములన్ని
నిండి వెల్గెడు వాని నిశ్చలభక్తి
ప్రార్థింతు శుభములు పడయుట కొఱకు
మానవాళి మాసముల మసలుచుండి
మంచి చెడ్డల నెపుడు వీక్షించువాని
సజ్జనుల నేలికుజనుల సంహరించి
ధర్మమును కుటుంబముగాఁసేవించువాని
పెద్దలగు పెద్దయగు వానిని పేర్మినెంతు
మంచి చెడ్డలను ఎదను విచారించి
మంచి సేవించి చెడును త్యజించు బుద్ధి
మంచి బోధించువారిని సేవించు బుద్ధిని
దేశభక్తి నొసంగఁ బ్రార్థింతునీశుని
సకల జనుల సమ్మతమగు సత్యవాణి
నీతినియమములను తప్పని నిత్యకర్మ
దయను ప్రసాదింప నీశుని ప్రార్థన మొనర్తు
వేడ్కవిశ్వమును సృష్టిగావించువాని
ప్రీతిభూత రక్షణమొనరించువాని – చివరకఖిలము విలయుము చేయవాని
ప్రభువు నీశ్వరుని అంజలి ప్రస్తుతింతు – సర్వమయమైనధర్మము, సత్యమును రక్షించువాని
ప్రతి ఒకరికి సద్బుద్ధి కల్గించువానిని – సృష్టికర్తయైన కృష్ణపరమాత్మకు నమోనమః

✶

స్వార్థం అనర్థదాయకం

# అమ్మానాన్న కన్నతల్లీ !

- కోడం మల్లయ్య

పల్లవి॥ అమ్మా నాన్నా కన్న తల్లీ
ఎంత సేవ చేసినా తనివితీరబోదమ్మ !

1) చ॥ నన్ను నీవు కడుపున నవమాసాలు మోసి
పురిటి నొప్పి బాధలతో - ధరణిపైన వేసితివి (ధరణి) .....
అడ్డాలపై వేసుక లాలించి పాలిచ్చీ (అడ్డాల)
గోరుముద్ద తినిపించి బుడిబుడి నడకలు నేర్పిన ॥ ॥అమ్మా॥

2) చ॥ పూర్వజన్మలో నేను ఏ రూపములున్నానో
వచ్చే మరుజన్మలోన - ఏ రూపములుండగలనో ॥ఏరూపం॥
నాన్న గారి ప్రతిరూపం నీ గర్భ ప్రతిఫలమై ॥నాన్న॥
మానవ జన్మకు వచ్చియింత వాడినయ్యాను ॥ ॥అమ్మా॥

3) చ॥ తలిదండ్రీ తొలిదైవామని ఇలలో తెలుసుకొని
వీరిని మించిన దైవం - వేరొకరూ లేరనుచు ॥వేరొకరూ॥
భేదభావములు విడిచి ప్రేమా అనురాగముతో ॥భేద॥
విరబూసే పారిజాత కుసుమాలతో పూజజేతుగనమ్మా ॥ ॥అమ్మా॥

✶

**మానవుడు ఫలాన్ని ఆశించక "మంచి పనులు చేయాలి" దీనినే నిష్కామకర్మలు అంటారు. ఈ ఫలాలను భగవంతునికి అర్పించాలి దీనినే కర్మయోగము అంటారు.**

అసూయగల హృదయం అశాంతికి నిలయం

ప్రార్థన భారతి

# హనుమాన్ చాలీసా - 24

- అను, వ్యాఖ్య : ఆచార్య కసిరెడ్డి

**హింది : భూత పిసాచ నికట నహిఁ ఆవై ॥**
**మహావీర జబ నామ సునావై ॥**
**తెలుగు : ఓ మహావీరుడా ! నీ పేరు విన్నంత**
**భూత పైశాచాలు దరిచేరవిసుమంత.**

**భావం :** మహావీరుడైన ఓ స్వామీ ! నీ నామాన్ని శ్రవణం చేసినంత మాత్రంలోనే భూత ప్రేత పిశాచాలు దగ్గరికి రాకుండా పారిపోతాయి (నీ నామానికంత శక్తి ఉంది స్వామి !).

**వ్యాఖ్య :** హనుమంతుని నామస్మరణం, శ్రవణం, జపం, ధ్యానం అన్నీ మహాశక్తినిస్తాయి. జీవుని శక్తి దేవునిశక్తిగా మారుతుంది. అది దివ్యశక్తి. ఆ శక్తికి ఎవరూ నిలవలేరు. దుష్టులను అణచివేసే శక్తి అది ; శిష్టులను కాపాడే శక్తి అది. లోకోత్తర వీరుడైన హనుమను తులసీదాసు ఈ దోహాలో మహావీర్ అన్నాడు. మహాలక్ష్మి, మహాకాళి, మహాసరస్వతి అని ముగురమ్మలను మహాశక్తులుగానే సంభావిస్తాం. నవదుర్గలుగా అవతరించిన ఈ మహాశక్తులు మధుకైటభ, మహిషాసుర, శుంభనిశుంభాది రాక్షసులను సంహరించి లోకాలను రక్షించారు. అందుకే ఆ తల్లులను అష్టోత్తరాలతో సహస్రామాలతో అర్చిస్తాం.

శ్రీ విష్ణునామాలు, శ్రీ శివనామాలు, శ్రీ గోవిందనామాలూ శ్రీ లలితా సహస్రనామాలు కలియుగంలో స్మరించడం, శ్రవణం చేయడం మహాశక్తి దాయకాలుగానే పెద్దలు చెబుతారు. అందులో మనిషికి హానికలిగించే దుష్టశక్తులైన భూతపిశాచాలు పారిపోవాలంటే హనుమంతుని నామం వినాల్సిందే ; పలకాల్సిందే ; స్మరించాల్సిదే. వ్యక్తులనే కాదు, దేశాలనే ఆక్రమించాలనుకొనే ఈ విదేశీ భూతపిశాచాలను పారద్రోలడానికి హనుమ నామం వినాల్సిందే ; శక్తి పూజారులు కావాల్సిందే.

✶

**మనం వేసే ప్రతి అడుగు అనంత ఆత్మ విశ్వాసంతోనే ఉండాలి. ఎక్కే ప్రతి మెట్టు స్థిరంగా, స్నేహంగా, మోసే ప్రతి బరువు తొణికిసలాడకుండా ఓర్పుతో ఉన్నప్పుడే ఆకాశమే దిగి వస్తుందా అన్నట్టు ఆకాశమంత ఆనందంలో మునిగిపోతాం**

ఔన్నత్యం సంపదవల్ల కాదు, సద్గుణాల వల్ల వస్తుంది

ప్రబోధ భారతి

# జీవుడా మేలుకో !

- బ్రహ్మలీన శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి

1) పుట్టిచచ్చుట రోగమగునన్నా
భవరోగవైద్యము, భూతలంబునె కలదురోరన్నా
వైద్యసదుపాయంబు లేని
ఇతరలోకముల కేగి యచట
రోగశాంతియు కుదరనేరక
బాధనొందెదవేల నరుడా !
తత్త్వసారము తెలిసికోరన్నా
సద్గురుని చెంత, నిజము గనుగొని లాభమొందన్నా !

ప్రపంచములో ఎవనికైనను వ్యాధిసంక్రమించినచో అది కొన్ని గంటలు వరకు లేదా కొన్ని రోజుల వరకు బాధించును. ఇంకను తీవ్రతరమగు రోగములైనచో జన్మాంతము వరకు బాధను కలుగజేయును. కాని ఈ జగత్తునందు విచిత్రమైన వ్యాధి ఒకటి కలదు. దానిని గురించి పెక్కుమందికి తెలియదు. అది ఏ లక్షణములతో ఉండునో, ఎంతకాలము దుఃఖము కలుగజేయునో చాలా మందికి తెలియదు. అదియే భవరోగము. పుట్టుట చచ్చుట అను రోగము. ఈ రోగము అజ్ఞానము ఉన్నంతవరకు జీవుని బాధించుచునే యుండును. జన్మజన్మలవరకు వేధించును. ఈ సంసార రోగమునకు, జనన మరణరూప భవరోగమునకు వైద్యము నరజన్మ యందే, భూలోకమందే కలదు.

సజ్జనుల, సాధుపుంగవుల, ఆత్మజ్ఞుల సాంగత్యమందు ఆ రోగమునకు చికిత్స చేసుకొనవలెను. గురువాక్యానుసారము నడచుకొనుచు ఆత్మజ్ఞానమును భవరోగవిముక్తిని, బంధరాహిత్యమును సంపాదించవలెను. ఇట్టి వైద్యసదుపాయము ఇతర లోకములందు లభించుట దుస్తరము. గురుబోధ అను ఔషధములేని ఇతర లోకములకేగి నరుడు ఏల బాధపడవలెను ? భగరోగశాంతికి, దుఃఖ రాహిత్యమునకు ఈ జన్మయందే యత్నించవలెను. భవరోగవిముక్తికై కృషి సలుపు. జన్మాది దుఃఖములను అంతమొందించుకో.

**కల్లాకపటం లేని నవ్వే ఉత్తమ ఔషధం**

సద్గురు వాక్యములను అనుసరించుచు జననమరణ రూపవ్యాధిని నిర్మూలించుకో. అమూల్యావకాశమును సద్వినియోగము చేసుకో. వైద్య సదుపాయము లేని ఇతరలోకముల కేగి పశ్చాత్తాపపడుటకంటె, ఈ లోకమందే, ఈ జన్మయందే మహాత్ములను ఆశ్రయించి, సాధనగావించి దీర్ఘరోగమును, భవరోగమును బాపుకో. నిత్యశాంతిని అనుభవించు.

**2) విద్యలెన్నియొ కలవురోరన్నా**
**అన్నింటిలోను, చావుతప్పే విద్యగొప్పన్నా**
**ఎన్ని చదువులు చదువనేర్చిన**
**పుట్టి చచ్చిన నేమి ఫలము**
**జన్మమేమియు లేని పదవిని**
**కలుగజేసెడి విద్య శ్రేష్ఠము**
**తత్త్వసారము తెలిసికోరన్నా**
**సద్గురుని చెంత, నిజము గనుగొని లాభమొందన్నా !**

నదీప్రవాములోపడి కొట్టకొనిపోవుచున్న మనుజుని రక్షించు విద్య ఏది ? ఒక్క ఈత విద్యయే. అంతియే కాని భౌతిక విద్యలేవియును ఆ ప్రమాదము నుండి అతనిని సంరక్షించజాలవు. అటులనే ఈ సంసారప్రవాహములో పడి దిక్కుతోచక పెక్కుమంది జనులు నానాబాధల నొందుచున్నారు. సంసారసాగరము నుండి, భవసాగరమునుండి ఉద్ధరింపబడుటకు మార్గము తెలియకున్నారు. అట్టివారిని దరికిచేర్చి కాపాడునది ఒక్క బ్రహ్మవిద్యయే, ఆత్మజ్ఞానమే. తక్కిన ప్రాపంచిక విద్యలన్నియు భుక్తి నొసంగగలవు గాని,, ముక్తిని, మృత్యువును తప్పించజాలవు. పూర్ణశాంతిని ఒసంగజాలవు. చావును తప్పించగల చదువే నిజమైన చదువు. ఆత్మవిద్యలవలన మనుజుడు జన్మ, వ్యాధి, వార్ధక్యము, మరణము మున్నగు ఘోరదుఃఖముల నుండి అవలీలగా విముక్తుడై మృత్యుంజయుడై, సాక్షాత్ దైవ స్వరూపుడై, శాశ్వత ఆత్మస్వరూపుడై విరాజిల్లును.

ఓ జీవుడా ! మోహనిదురనుండి మేల్కాంచు ! సద్గురు మహాత్ముని చెంత తత్త్వశాస్త్రము నభ్యసించు. విద్యలన్నిటిలోను అమరవిద్యయగు విద్యయే శ్రేష్ఠమని తెలుసుకో. అట్టి మహోన్నత ఆత్మవిద్య కొరకై, బ్రహ్మజ్ఞానము కొరకై యమనియమాది సాధనగావించు. చావుపుట్టుకలకు పూర్ణవిరామము పెట్టు. జన్మరాహిత్యమొంది స్వస్వరూపానందమును అనుభవించు. ధన్యుడవుకా! ✶

**వాడిన మాట, విసిరిన రాయి తిరిగి రావు**

**మంత్ర భారతి**

# మనసు యొక్క ద్విపాత్రాభినయనం

**- డా॥ క్రొవ్విడి సుబ్బారావు**

మానవ శరీరంలో అత్యంత ప్రధానమైనది మనస్సు. మనస్సు ద్వారా మనిషి తనను తాను వ్యక్తపరుస్తాడు. మనస్సు ద్వారా మనిషి గుర్తింపబడతాడు. మనస్సు ద్వారానే మనిషి వ్యక్తిత్వం అవగతమవుతుంది. ఆలోచనాశక్తి ఉన్నతమైన శక్తి. నీవు, నీ మనస్సు ఒక్కటే. నీకు, నీ మనస్సుకు ఎలాంటి వ్యత్యాసం లేదు. మనస్సు ఎల్లప్పుడూ ఏదో విషయం గురించి ఆలోచిస్తూ వుంటుంది. సదాలోచనలైనా, దురాలోచనలైనా మనస్సు యొక్క ప్రత్యక్ష వ్యక్తికరణాలే. ఆలోచనా విధానానికి తేజస్సు కలిగించేది చిత్. మనమంతా మన ఆలోచనల ఫలితమే, ఉత్పత్తులమే; మనం ఏమి ఆలోచిస్తామో అదే విధంగా మారుతాము, మన ఆలోచనలు ఉన్నతంగా వుంటే మనం ఉన్నతంగా మారుతాము. సమస్త ప్రపంచాన్ని మనస్సు సృష్టిస్తుంది. మన జన్మకు, ఉనికికి, కార్యకలాపాలకు, చివరకు మన ఆలోచనల నాశనానికి మనలో వున్న చైతన్యమే జ్ఞానం కలిగిస్తుంది. మనస్సు ప్రపంచాన్ని నడిపిస్తుంది. మనస్సు దాన్ని ఇటూ, అటూ లాగుతుంది. అన్ని విషయాలు జరగడానికి, మనస్సు దాని శక్తియే ఏకైక సత్యం. మనస్సు మానవ జీవితంలో ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది.

స్వచ్ఛమైన ఆలోచనలు మనస్సును నిర్మలంగా చేసి శక్తి నిస్తాయి. మన మనస్సులో కలిగే అంతరాలోచనల వల్లనే మనం మంచివ్యక్తిగా, ధార్మికుడిగా మారుతాము. ఒక ఆధ్యాత్మిక ఆలోచనాశక్తి మాత్రమే నిరాశాపూరిత, నకారాత్మక, మందమైన ఆలోచనలను నిర్వీర్యం చేయగలదు. స్వచ్ఛమైన మనస్సు ప్రకృతిని, పదార్థాన్ని చైతన్యంలో సమ్మేళనం చేస్తుంది. దీర్ఘకాలంలో ఆలోచనాశక్తియే అన్ని రకాల మానవశక్తుల కన్నా గొప్పది. మనం ఆలోచించినదాన్నే ఆచరిస్తాము. మన శరీరం కూడా అదే దిశలో స్పందిస్తుంది. ప్రతి విషయం మన ఆలోచనవల్లనే నిర్మాణం జరుగుతుంది. మనం మన ఆలోచనలను సృష్టి చేస్తాం.

మానవ జీవితంలో ఆలోచనకు గొప్ప ప్రాధాన్యత వుంది. మనస్సు స్వర్గాన్ని నరకంగాను, నరకాన్ని స్వర్గంగాను మార్చగలదు. మనం ఈ ప్రపంచాన్ని మనస్సనే గాజు ఫలకం ద్వారా

**పూలలోని సువాసన, మనిషిలోని యోగ్యత దాచితే దాగనివి**

చూస్తుంటాం. మనం మన ఆలోచనా విధానానికి ప్రతిరూపాలం. మనం అసూయా ద్వేషాలు పెంచుకుంటే అవి మనమీదికి దండయాత్రకు వస్తాయి. స్వచ్ఛమైన ఆలోచనలు మాత్రమే సంపూర్ణ ఆరోగ్యాన్ని, శాంతిని ప్రసాదించగలవు. మనస్సే మనిషికి సర్వస్వం. మనిషి ముందు తన మనస్సును అపరాధిని చేస్తాడు. అప్పుడు అతడు అందరిలో పొరపాట్లను, అపరాధాలనే చూస్తాడు. మనస్సులు మానవాళికి మంచి చేకూర్చడానికి కాని చెడు చేయడానికి కాని పరస్పరం పనిచేస్తూ వుంటాయి. ప్రతి మనస్సు ఎక్కడ వున్నా సమస్త ప్రపంచంతో సంబంధం కలిగి వుంటుంది.

**"మనస్సు తన భావనాశక్తి ద్వారా, ధారణా శక్తి ద్వారా ఆలోచనలను, ఇంద్రియాలను అధిగమించినప్పుడు ఆత్మజ్ఞానం పొందుతుంది. మానవుడు తన సత్కర్మల ద్వారా సత్పురుషుడుగాను, దుష్కర్మల ద్వారా దుష్టుడిగాను మారుతాడు. మనం ప్రస్తుతం ఉన్న స్థితి మన ఆలోచనల ఫలితమే. మనం ఆచరించే కర్మలు మన జీవన విధానాన్ని అన్ని రకాలుగా నిర్ణయిస్తాయి. మన ఆలోచనల ఫలమే ఈ ప్రపంచం."**

**– బృహదారణ్యక ఉపనిషత్తు (3-2-13)**

## ఆలోచనల విశ్లేషణ

ఆలోచనలను మూడు విధాలుగా విశ్లేషణ చేయవచ్చును. పరిమాణం, నాణ్యత, దిశ.

ఆలోచనల పరిమాణం:– ఎంత శీఘ్రుంగా ఆలోచనలు కలుగుతాయో, ఎన్ని ఆలోచనలు వస్తాయో, ప్రతి సెకనుకు ఎన్ని ఆలోచనలు కలుగుతాయో లెక్క కట్టడం. ఈ పరిమాణం ఎంత ఎక్కువగా ఉంటే అంత దుఃఖ కారణం.

ఆలోచనల నాణ్యత:– మనస్సులో ఉత్పన్నమయ్యే ఆలోచనల నాణ్యత ఎలా వుంటుందో దాన్ని బట్టి మానవుడి ప్రవర్తన ఉంటుంది. మంచి లేదా చెడు ఆలోచనలు, స్వచ్ఛమైన లేదా మలినమైన ఆలోచనలు, స్వార్థం లేక నిస్వార్థ ఆలోచనలు.

ఆలోచనల దిశ:– ఆలోచనలు ఏ దిశగా పయనిస్తున్నాయో గమనించాలి. మామూలుగా ఆలోచనలు ఒకే దిశగా పయనిస్తుంటాయి. మనలో కోపం కలిగితే మన పరిసరాలన్నీ తప్పులుగా అగుపడ్తాయి. మన ఆలోచనలు సంతోషకరంగా వుంటే మన చుట్టూ సంతోషం వెల్లివిరుస్తుంది. అంతా సవ్యంగా వున్నట్టు గోచరిస్తుంది.

**వ్యవస్థ మారాలంటే, ముందుగా మనం మారాలి**

## ఆలోచనల పరిమాణ నియంత్రణ

ఆలోచనలు అధికంగా వుంటే మనం వ్యాకులతతో, దుఃఖంతో వుంటాము. మనకు కోపం కలిగితే ఆలోచనల పరిమాణం అనూహ్యంగా పెరిగి మనం నియంత్రణ కోల్పోతాం. దానివల్ల ఆచరించే కార్యాల వల్ల ఎక్కువ తొందరపాటు, కలవరం, హాని కలుగుతుంది. ఆలోచనల పరిమాణం ఎక్కువగా వున్నప్పుడు మానసికంగా కలతచెంది నిద్రలేమి, అజీర్ణం, తలనొప్పి, రక్తపోటు, ఉద్వేగం లాంటి లక్షణాలతో బాధకు లోనౌతాము. నిజానికి ఎక్కువ ఆలోచనలవల్ల క్రుంగుపాటుకు, విచారానికి, పశ్చాత్తాపానికి గురౌతాము. ఇది ఉన్మత్తతకు దారి తీయవచ్చును.

మనస్సులో ఆలోచనలు తక్కువగా వుంటే ప్రశాంతతను, మనస్థిమితాన్ని అనుభవిస్తాం. అందుకే మనం సుషుప్తావస్థలో ప్రశాంతంగా వుంటాం. అనవసరమైన ఆలోచనలవల్ల అస్వాభావిక స్థితికి చేరి దుఃఖానికి లోనౌతాం. అనవసరమైన ఆలోచనలను మనస్సు నుండి తొలగిస్తే శాంతి, సుఖసంతోషాలు కలుగుతాయి.

మనం నిరంతరం ఏదో ఒక అర్థవంతమైన పనిలో నిమగ్నమై, క్రమశిక్షణతో వ్యవహరిస్తే, ఆలోచనల పరిమాణాన్ని నియంత్రించవచ్చును. "పనిలో క్రమశిక్షణ" అంటే కార్యక్రమాలను సమయపాలన చేస్తూ సక్రమంగా నిర్వర్తించడం, క్రమశిక్షణతో పనులు జేస్తూ వుంటే సమయం వృధా కాదు. మనం చేసే కార్యాలకు మళ్లీ మళ్లీ ప్రణాళికలు చేసే అవసరం వుండదు. మనస్సులోని విపరీత భావాలకు, భ్రమలకు తావివ్వకుండా క్రమశిక్షణతో వుంటే మనస్సు ప్రశాంతంగా వుంటుంది.

మనం సదా నిర్మాణాత్మకమైన, ఆరోగ్యవంతమైన పనుల్లో నిమగ్నమై వుండాలి. మనం చేస్తున్న పనిపై మనస్సును కేంద్రపరచాలి. పనుల్లో నిమగ్నమై వున్నామంటే జాగరూకతతో వున్నామన్న మాట. ఉదాహరణకి మనం కారు డ్రైవ్ చేస్తున్నప్పుడు మనస్సు నిశ్చలంగా వుండడానికి ప్రయత్నం చేస్తాం. పరధ్యానంగా వుండం. మన రకరకాల కార్యక్రమాల్లో నిమగ్నమై వుంటే మన మనస్సులో అనవసరమైన ఆలోచనలు రాకుండా వుంటాయి. మనస్సు సరైన పద్ధతిలో వుండేలా ప్రయత్నం చేస్తే అనవసరమైన ఆలోచనలకు తావుండదు.

## ఆలోచనల నాణ్యతను నియంత్రించడం

ఆలోచనలు వాటి స్వభావరీత్యా మంచి, చెడు ఆలోచనలుగా వుంటాయి. సదాలోచనలు మనం ఉన్నతమైన జీవితం గడపడానికి ప్రేరణ కలిగిస్తాయి. విశ్వజనీయ మూల్యాలకు

**నిద్రకు ఆలోచనకు పడదు ఒకటి ఉంటే మరొకటి రాదు**

ప్రాధాన్యతనిచ్చే జీవనానికి దారితీస్తాయి. చెడుఆలోచనలు మనల్ని అనారోగ్యకరమైన, స్వార్థపూరిత కార్యక్రమాల వైపు త్రోసివేస్తాయి. మన ఆలోచన నాణ్యతను పెంచుకోవాలంటే మన మనస్సును ప్రశాంతంగా ఉంచాలి. మనకు ఆరుగురు శత్రువులున్నారు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు. వీటిని దూరంగా వుంచితే మన మనస్సు ప్రశాంతంగా వుంటుంది. మనస్సు ప్రశాంతంగా వుండడంవల్ల ఆలోచనలు ఉన్నతంగా వుంటాయి. ఉన్నతమైన ఆలోచనలు మనస్సును శుద్ధ పరుస్తాయి.

## ఆలోచనల దిశను నియంత్రించడం

మన ఆలోచనలు ఒకే దిశగా పయనించే ప్రయత్నం చేస్తూ వుంటాయి. వాటి దిశను మార్చడం కష్టం. మనకున్న సమస్యల్లా మన మనస్సుకు పలుదిశల తిరగడం అలవాటుగా మారిపోయింది. అది మనతో సహకరించదు. మనం మన మనస్సును నిరంతరం ఉన్నతమైన భావాలకు, సదాలోచనలకు దగ్గరిగా వుండేలా ప్రయత్నం చేయాలి. ఈ ప్రక్రియవల్ల మన అంతరంగం దృఢపడుతుంది. శక్తివంతమవుతుంది. చెడు సహవాసం చాలా హానికరం, దుష్ట భావాలను ఆకర్షిస్తుంది.

సత్సంగం ఎంతో శక్తివంతం. అనవసరమైన ఆలోచనలు మనలో ప్రవేశించకుండా మన చుట్టు ఒక కోటగోడను నిర్మాణం చేస్తుంది. అయితే మనం అడపదడపా కాకుండా సదా సత్సంగంలో గడపాలి.

ఆదిశంకరులు “భజగోవిందం” లో ఇలా సెలవిచ్చారు.

**సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వమ్ ।**
**నిర్మోహత్వే నిశ్చలతత్వమ్, నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః ॥**

– సత్సంగం వల్ల త్యాగబుద్ధి, వైరాగ్యం కలుగుతుంది. వైరాగ్యం వల్ల మోహం నుండి స్వేచ్ఛ లభిస్తుంది. మోహంనుండి స్వేచ్ఛవల్ల మనస్సు నిశ్చలమవుతుంది. నిశ్చలమైన తత్త్వం వల్ల జీవన్ముక్తి కలుగుతుంది.”

ఇది సత్సంగం యొక్క శక్తి. సత్సంగం అంటే ప్రపంచం నుండి తప్పించుకొని ఏదైనా ఆశ్రమంలో చేరడం కాదు. లౌకిక జీవనం గడుపుతూనే చాలా సమయం పవిత్రమైన వ్యక్తుల సమక్షంలో గడపాలి. సద్గ్రంథ పఠనం అలవర్చుకోవాలి. ఆధ్యాత్మిక ప్రవచనాలు వినాలి. మంచి సంగీతం వినాలి. ఉన్నతమైన భావాల గురించి సదా ఆలోచిస్తూ వుండాలి. సత్పురుషుల సాంగత్యంలో గడుపుతూ, సత్కర్మల నాచరిస్తూ సత్సంగం అలవర్చుకోవాలి. దీన్నే మన శాస్త్రాల్లో మననం, నిధి ధ్యాసనం అని వ్యవహరిస్తారు.

**ఔదార్యంగల హృదయమే అమూల్యమైన హృదయం**

## మనస్సు యొక్క త్రివిధ కదలికలు

మనస్సు కాలం, ప్రదేశం, వస్తువులతో పాటు కదులుతూ వుంటుంది. మనస్సు యొక్క కదలికలను నియంత్రించాలి.

కాలంతో పాటు మనస్సు కదలిక:- భూత, భవిష్యత్, వర్తమాన కాలంలోని ఆలోచనల మధ్య తిరగడం, ఉదా॥ మనం ఒక పని చేస్తూ వుంటే ఇరవై సంవత్సరాల క్రితం జరిగిన సంఘటనలు మన మనస్సులో మెదలుతాయి. ఇదే మనస్సు కాలంలో కదిలే విధానం.

ప్రదేశంలో మనస్సు కదలిక:- ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశం వైపు మనస్సు తిరుగాడుట. ప్రస్తుతం ఆఫీసులో కూర్చొని వున్నా, మనస్సు ఇంటివద్ద మరో వస్తువువైపు కదలడం, ఆలోచించడు.

వస్తువుల మధ్య మనస్సు కదలిక:- మన అలోచనలు ఒక వస్తువు నుండి మరో వస్తువు వైపు గెంతడం, ఒక క్షణం కొన్ని మిఠాయిల గురించి ఆలోచిస్తూ, మరో క్షణంలో కొత్తకారును కొనడం గురించి ఆలోచించడం.

మనస్సును కదలకుండా ఒక ప్రదేశంలో వుంచడం ధారణ. వస్తువుల వెనక మనస్సును పరిగెత్తకుండా నియంత్రించడం, ధ్యానం. కాలంలో మనస్సును నిశ్చలంగా వుండేలా నియంత్రణ చేయడం సమాధి.

మనం పరీక్ష కొరకు శ్రద్ధగా చదవడం అన్న ప్రక్రియలో దీర్ఘంగా లీనమైనప్పుడు సమయం ఎలా గడచిపోతుందో తెలియదు. అదే ధారణ. ధ్యానంలో ఒకే ఆలోచనా తరంగంపై నిశ్చలంగా వుంటాము. ఆ భావనలో చాలా సేపు నిలకడగా వుంటే సమాధి. కాల పరిధిలో మనస్సును చాలా సమయం వరకు నిలిపితే అది సమాధి స్థితి అవుతుంది.

## త్యాగం వల్ల ఆలోచనలలో తగ్గుదల

మనుష్యులు, వస్తువులపట్ల రాగం వల్ల మనస్సులో ఎన్నో ఆలోచనలు ఉద్భవిస్తాయి. వాటివల్ల మనం కలవరం చెందుతాము. ఆలోచనలకు మూలమైన కారణాన్ని మనం త్యజించాలి. అప్పుడు అపజయాలు, మనోవికారాలు వుండవు. మనల్ని ఒక ఆలోచన సదా మనస్తాపం కలిగిస్తుంటే ఆ ఆలోచన వెనుక ఒక వస్తువు, ఒక వ్యక్తి వుంటుందన్న విషయాన్ని జాగ్రత్తగా గమనించాలి. వస్తువు, వ్యక్తి లేకుండా ఆలోచన వుండదు. వివేకం, విచారం, త్యాగం వల్ల ఆ మూలకారణాన్ని త్రెంపివేయాలి. ముందు మనఃక్లేశం కలిగించే బంధాలను త్యజించి ఆ తర్వాతనే ధ్యానప్రక్రియపై ప్రయత్నించాలి. ఆత్మచైతన్యం పట్ల ఎరుక, ఆత్మవిశ్వాసం లేకపోవడం, మనస్సులో అపారమైన భయం నిండి వుండడం వల్ల అనవసరమైన, అక్రమమైన ఆలోచనలు కలిగి మనశ్శాంతి భగ్నం కలిగిస్తాయి. ✶

**విజయంలో కన్నా విపత్తులోనే మనిషి గొప్పతనం తెలుస్తుంది**

# శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రం

*(గత సంచిక తరువాయి)*

**సంకలనకర్త : శ్రీ సంకేపల్లి రాజమల్లారెడ్డి** **నామార్థం : ఆచార్య కసిరెడ్డి**

**సురేశః శరణం శర్మ విశ్వరేతాః ప్రజాభవః ।**
**అహః సంవత్సరో వ్యాళః ప్రత్యయః సర్వదర్శనః ॥ (10)**

**85)** **సురేశః –** సురలకు ఈశుడైనవాడు.

**86)** **శరణం –** ఆర్తుల ఆర్తిని పోగొట్టువాడు.

**87)** **శర్మన్ –** పరమానంద రూపమైన సుఖమునిచ్చేవాడు.

**88)** **విశ్వరేతాః –** విశ్వోత్పత్తికి కారణమైనవాడు.

**89)** **ప్రజాభవః –** సర్వప్రజల జననానికి కారణమైనవాడు.

**90)** **అహః –** సర్వ ప్రకాశకుడైన విష్ణువు. అహము అంటే పగటి కాలమని కూడా అర్థము.

**91)** **సంవత్సరః –** కాల రూపమున నున్న విష్ణువు.

**92)** **వ్యాళః –** కాల సర్పమువలె పట్టుకొనడానికి వీలుపడనివాడు అంటే పట్టుకొన శక్యము కానివాడని అర్థము.

**93)** **ప్రత్యయః –** నిర్విషయక జ్ఞానమే ప్రత్యయము. ఇదే బ్రహ్మతత్త్వము. తన చూపులే ఉన్నవాడు.

**94)** **సర్వదర్శనః –** అన్నీ తన దర్శనాలే కలవాడు. అంటే ఎటుచూచినా తన చూపులే ఉన్నవాడు.

**అజస్సర్వేశ్వరస్సిద్ధః సిద్ధిస్సర్వాది రచ్యుతః ।**
**వృషాకపి రమేయాత్మ సర్వయోగ వినిస్సృతః ॥ (11)**

**95)** **అజః –** జననము లేనివాడు, పూర్వము పుట్టలేదు. ముందు పుట్టబోడు.

**ఈ రోజుటి మంచిపని, రేపటికి శ్రీరామరక్ష**

96) **సర్వేశ్వరః –** ఈశ్వరులగు ఎల్లవారికిని ఈశ్వరుడు.

97) **సిద్ధః –** త్రైకాలికుడు, కారణ రహితుడు అనుభవ గోచరమైన చిత్‌రూపుడు.

98) **సిద్ధిః –** సాధకునికి కలిగే అనుభవము వల్ల సిద్ధిని పొందింపజేసేవాడు.

99) **సర్వాదిః –** సర్వప్రాణులకు అది కారణమైనవాడు.

100) **అచ్యుతః –** ఏ కారణం చేత కూడా తొలగినవాడు, జారిపోనివాడు.

101) **వృషాకపిః –** సర్వకామ ఫలాలను వర్షించే వారాహరూపుడు, వృష అంటే ధర్మము, కపి అంటే రూపము.

102) **అమేయాత్మాః –** ఇంత పరిమితి అని నిర్ణయించడానికి వీలు కానట్టివాడు.

103) **సర్వయోగ వినఃశ్రుతః –** అన్ని విధాల సంబంధాల నుండి బయటపడ్డవాడు. ఎవరితో ఏ సంబంధం లేనివాడు అని అర్థం.

**వసుర్వసు మనాస్సత్యః సమాత్మా సమ్మితస్సమః ।**

**అమోఘః పుండరీకాక్షో వృషకర్మా వృషాకృతిః ॥ (12)**

104) **వసుః –** సర్వభూతములు తనలో కలవాడు. సర్వభూతాలలోనూ వసించువాడు.

105) **వసుమనాః –** ప్రశస్తమైన మనస్సు ఉన్నవాడు.

106) **సత్యః –** అసత్యము కాని రూపమున్నవాడు.

107) **సమాత్మాః –** రాగద్వేషాది దోషరహితమైన మనస్సు కలవాడు.

108) **సమ్మితః –** మితః అంటే తెలియబడువాడు ; సమ్మితః అంటే మిత్రుడు కానివాడనీ దృశ్య మాన పదార్థాలకు అందేవాడు కాడని అర్థము. అమితుడు అపరిచ్ఛిన్నుడు అన్నమాట.

109) **సమః –** సర్వకాలాల్లోను వికార రహితునిగాను, ఏక రూపంగాను ఉండువాడు.

110) **అమోఘః –** వ్యర్థుడు కానివాడు, పూజించబడువాడు.

111) **పుండరీకాక్షః –** హృదయ మధ్యస్థమగు పుండరీకమును యుండువాడు.

112) **వృషకర్మాః –** ధర్మకర్మానుష్ఠానపరుడు.

113) **వృషాకృతిః –** ధర్మాచరణ నిమిత్తం ఆకృతి ధరించి లోకంలో అడుగు పెట్టేవాడు. ★

సద్గుణాలు విలువైన ఆభరణాలు

# కబీర్

ఆంగ్లమూలం - స్వామి శివానంద అనువాదం : శ్రీవత్స

ప్రియమైన పసిపాపలారా, ఓం నమోనారాయణాయ.

కాశీ పట్టణంలో ప్రసిద్ధికాంచిన మహాత్ముడు, కవి కబీర్ – పిల్లలులేని మహమ్మదీయ నేతగాడు నీరు, నీమ దంపతులకు కాశీకి దగ్గరలో ఉన్న లహర్‌తలాబ్ అనే చెరువులో పసిపాపలా తామరాకుపై తేలుతూ దొరకాడు. ఆ పసివానికి నామకరణం చేయమని ఒక కాజీని పిలవగా, ఆ పసిపాప రాక్షశాంస కలవాడనీ, అతన్ని చంపివేయమని సలహా ఇచ్చాడు. ఆ పసిపాప గుండెల్లో కత్తిని దిగేశారు. ఆశ్చర్యంగా ఒక్క బొట్టు రక్తం చిందలేదు. ఆ పసిపాప ఒక అద్భుతమైన గీతం ఆలపించింది. ఆ పసిపాప మామూలు రక్తమాంసాలుగల మానవుడు కాదనీ వారికి అర్థమయ్యింది. అతనికి 'కబీర్" అని నాకరణం చేశారు. కబీర్ అంటే 'గొప్ప' అని అర్థం.

పసితనం నుండి కూడా కబీర్ ధార్మిక విషయాలపట్ల ఎంతో ఆసక్తి కలిగించేవాడు. సాధువులను, సన్యాసులను కలిసి వారిని అత్యంత భక్తి విశ్వాసాలతో సేవించేవాడు. అతన్ని పెంచిన తండ్రి అతనికి వివాహం జరిపించినా ఇంటికీ, సంసారానికి ఎన్నడూ కట్టుబడి ఉండలేదు. పవిత్రమైన కాశీ పట్టణంలో సంచారం చేసేవాడు.

స్వామి రామానందకు శిష్యుడిగా కావాలనుకున్నాడు కబీర్. అయితే తను మహమ్మదీయుడు కావడంవల్ల తనను శిష్యునిగా స్వీకరిస్తారో లేదో అని సందేహించాడు. ఒకరోజు రామానంద ప్రతిదినం స్నానంచేసే గంగా ఘాట్‌కు వెళ్లాడు కబీర్. ఇంకా చీకటిగా ఉంది. మెట్లపై పడుకున్న కబీర్‌ను రామానంద గమనించలేదు. అతని ఛాతీపై కాలు పెట్టాడు. ఒక మానవ శరీరంపై తన పాదంపడిందని తెలుసుకున్న రామానంద "రామ్–రామ్" అని విలపించాడు. మేల్కొన్న కబీర్ 'చివరిగా నేను అతణ్ణి తెలుసుకున్నాను' అని తలచి రామానంద కాళ్ళపై పడ్డాడు. "స్వామీ ! మీరు నాకు మంత్ర దీక్షను ఇచ్చారు. మీరు నా గురువులు. నేను మీ శిష్యుణ్ణి" అన్నాడు. ఆ గురువు కబీర్‌కు సంప్రదాయ బద్ధంగా మంత్రదీక్షనిచ్చాడు.

విశ్వజననీయ భ్రాతృత్వానికి ప్రవక్త కబీర్. ధర్మం, ఆధ్యాత్మిక, ప్రేమ, భక్తి, విశ్వాసం, దివ్యజీవనం ఏ ఒక్క మతానికి స్వంతం కావనీ అన్ని మతాలకు సంబంధించినవి అని తెలుసుకున్నాడు, నమ్మాడు. సరళత్వమే కబీర్ మతం. ప్రేమయే అతని నినాదం. విమోచనానికి

**పట్టుదల వుంటే పడినా తిరిగిలేచి ముందుకు సాగవచ్చు**

భగవంతుని పట్ల ఆరాధనా భావం, భగవంతుడు మాత్రమే ఏకైక మార్గం అతని ప్రగాఢ విశ్వాసం.

కబీర్ ప్రఖ్యాతిగాంచిన తత్త్వవేత్త, కవి. అతని కీర్తనలు అద్భుతం. అతని ఆధ్యాత్మిక అనుభవానికి, ప్రేమకు యాదృచ్ఛిక వ్యక్తీకరణ అతని పాటలు. కబీర్ తన పాటలలో, కీర్తనల్లో అందరికీ అర్థమయ్యే సాధారణ రూపకాలంను వాడేవాడు. ఈ రోజు వరకు ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో ప్రతి ఇంట అతని కీర్తనలు గానం చేయబడతాయి.

భగవాన్ శ్రీకృష్ణుడు కబీర్ కొరకు ఒక వస్త్రాన్ని నేచాడని ప్రతీతి. కాశీపట్టణంలో ఎప్పుడూ, ఎన్నడూ చూడనంత అద్భుతమైన వస్త్రం అది. ఆ వస్త్రం దారాలతో కాకుండా, సూర్యకిరణాలతో నేచి, అక్కడక్కడ అత్యంత సుకుమారమైన ఇంద్రధనుస్సు రంగులతో అలంకరింపబడినది.

జహన్‌గస్ట్ అనే మహమ్మదీయ ఫకీర్ కబీర్‌పట్ల అసూయకలిగి ఉండేవాడు. ఒకరోజు అతను కబీర్‌ను కలవడానికి వెళ్ళాడు. కబీర్ తన ద్వారానికి ఒక లావుపాటి పందిని కట్టి వేశాడు. ఆ ఫకీర్ పందిని చూచి కబీర్ ఇంట్లోకి అడుగు పెట్టలేదు. కబీర్ అతన్ని పిలచి "ఓ మహానుభావా ! మీరు ఎందుకు పరిగెడుతున్నారు? నేను నా ఇంటి ద్వారానికి ఒక మలినమైన పందిని మాత్రమే కట్టాను. కాని మీరు మీ హృదయంలో కోపం, గర్వం, అత్యాశ, అసూయద్వేషాలనే అపవిత్రమైన వాటిని కట్టివేశారు" అని సున్నితంగా మందలించారు. ఆ ఫకీరు తక్షణం కబీర్‌కు క్షమాపణ చెప్పి అతని శిష్యుడిగా మారాడు.

కబీర్ మరణించినప్పుడు హిందువులు, మహ్మదీయులు అతని శరీరం మాదంటే మాది అని వాగ్వాదానికి దిగారు. ఆ క్షణం అతని ఆత్మ ప్రత్యక్షమై "నేను హిందువును కాదు, మహ్మదీయుడనుకాను. ఇద్దరూ నేనే. నేనేమీ కాదు, నేనే సర్వస్వం. నేను ఇరువురీ భగవంతుణ్ణి దర్శించాను. మాయ నుండి స్వేచ్ఛపొందిన వారికి హిందు, ముసల్మాన్ సమానమే. నా శరీరంపై కప్పిన వస్త్రాన్ని తొలగించి చూడండి" అని చెప్పి అంతర్ధానమైపోయింది.

వస్త్రాన్ని తొలగించారు. ఆ వస్త్రం క్రింద ఎన్నో రకాల పుష్పాలు దర్శనమిచ్చాయి. వాటిలో సగం కాశీరాజు తీసుకొని పవిత్రమైన గంగా తీరంలో దహనం చేయించారు. ఆ భస్మాన్ని సేకరించి, ఖననంచేసి ఓ మందిరాన్ని నిర్మించారు. ఆ మందిరం "కబీర్ చౌరా"గా ప్రసిద్ధి చెందింది. కబీర్ అనుయాయులకు అత్యంత పవిత్రమైన యాత్రాస్థలం. మిగతా సగం పుష్పాలు మహమ్మదీయులు తీసుకెళ్ళి కబీర్ దేహం చాలించిన "మొఘర్" అనే చోట ఖననంచేసి, ఆ సమాధిపై మసీద్‌ను నిర్మించారు. ఈ స్థలం మహమ్మదీయులకు పవిత్రమైన స్థలం.

✶

**అధికార దుర్వినియోగం పెద్ద ప్రమాదాలను తెచ్చిపెడుతుంది**

# *SRI KRISHNA-THE IDEAL OF PERFECTION*

***- Swami Sivananda***

"Salutations to Narayana, the Primal Source of the world, to Hari, the singing of whose name and the hearing of whose glories is of untold merit; salutations to Vasudeva-Krishna, the beautiful lotus-eyed!"

The unique divine-personage of the charming Lord Sri Krishna is the glorious revelation to mankind, of the Eternal Absolute, in the greatest possible degree. Krishna is the ideal of perfection for all times. Even imagination has not been able to picture a more fully comprehenseive, integrated, harmonized, balanced and well-adjusted personality than that of Sri Krishna. The greatest hero, the most illumined scholar, the wisest statesman, the ablest politician, the mightiest warrior, the Lord of Yoga and the most supreme seer of the age that Krishna was, He offered Himself as the humblest servant of humanity. He dedicated His whole life for the complete uplift of the world, and He got nothing for Himself! He refused to become a king, when the throne was offered to Him. He, at whose mere word, kings came down from their thrones, never wanted to become a king! He, at whose terrorizing form the earth and heaven began to tremble, Himself washed the feet of the guests during the Rajasuya sacrifice and cleared the remains after their food! The mighty Yogeshwara became the driver of a chariot! He lived the life of an ideal Sannyasin absolutely detached from everything of the world, and yet He was the biggest family-man and the most fashionable person of the time! He possessed nothing of His own, even the site of His house was borrowed from the Varuna, and yet, He was the Master of the whole universe!

He, the simple cowherd-boy of the village, was a terror to the whole world of evil and injustice! He, the thief who stole away butter, delivered

**The more you try guess, the less you are at rest**

the immortal gospel of wisdom and referred to Himself as the goal, the sustainer, the Lord, the abode, the refuge, the benefactor, the origin, the dissolution and the seed imperishable of the entire universe and its inhabitants! All creatures come from Him and He pervades all of them. He remains intact in Himself and pervades the whole Universe with only a fraction of His Being. The Supreme God in the form of Sri Krishna spoke to the whole world of humanity through Arjuna on the eternal mysteries of existence.

To understand Krishna and His gospel fully is not possible with limited interests. Man sees things, not as they are, but as he is. Every individual is shut up within his own experience and knows nothing beyond him. This is why super human beings like Krishna and immortal laws like the Gita are misunderstood or rather not understood at all.

Man's ignorance about his own essential nature is hideous. His limited consciousness is covered by extensive ignorance and so he has perverted notions of God, the soul and the world, of freedom, perfection and immortality. It is the noble purpose of divine manifestations like Sri Krishna to brush aside ignorance and light up the torch of wisdom in those who have lost their way in darkness. The workings of such higher principles can be comprehended only through an integral development. Lop-sided progress will not bring and every man has to be like this. If he does not become like this, he may have wheat and rice, cattle and gold, women and bungalows, but he has failed as a human beings, as a worthy heir to life Eternal.

To be like this, it does not mean that one should be a demarcated devotee, a philosopher, a mystic or a man of action. One may begin by choosing to be any one of these, but in a later stage, it will be found that progress in any aspect necessitates an equal advancement in all as-

**Where wisdom is called for, force is of little use**

pects. Krishna endeared Himself to all as the most ideal personage, the 'Yogeshwara' and the 'Jagadguru' for all times, a Yogi, a Jnani, a man of action and a centre of love.

Krishna's incarnation was to goad man to be perfect, to be wise and powerful like Himself, to be the towering example of a person with unbroken self-consciousness. Even the mere remembrance of such a blessed being like Krishna is, therefore, an immediate redeemer from all troubles, the bestower of bliss and peace, for it excites a vibration of integration and harmony in the mind. Krishna's glorious deeds are to create in all an irresistible urge to become pure and strong, wise and powerful, blessed and immortal.

In the Sabha Parva of the Mahabharata, we find the terrible Bhishma speaking with firmness of mind. "The most venerable person on this earth is Sri Krishna. He surpasses all others in splendor, strength, valour and shines like the sun. By His very presence, our whole assemble is illumined with light and enlivened with you, like a dark place at the sight of the sun, like a room suffocating for want of air with the gush of breeze. Sri Krishna is the most venerable not only for us, but for all the three worlds. We worship Him and adore Him because of His wisdom and power, because of His being the source of joy and bliss to all creatures. In Krishna alone, I find all the really noble qualities. Krishna is the most worthy Guru, the best preceptor and priest, the friend and salvation of all. Those who do not worship Krishna are dull-witted and unfortunate". The adoration and admiration that the perfected condition of existence invites supersede that of every other that is not integrated.

The life of Lord Sri Krishna is the practical illustration in daily life of the great Yoga of Self-realisation, inclusive of every aspect of being. He lived the Yoga of Synthesis as He Himself expounded in His great gos-

**Peace is hard to find because it is under your nose**

pel. Every act of His life was an epitome of world-evolution. His laughs and movements indicated great changes in  some part of the other of the universe. No moment of His life was lived without serving a lofty purpose.

Here is the quintessence of Lord. Krishna's teachings – "To those men, who worship Me alone, thinking of no other, to those ever united with Me, I bring all safety. Come unto Me alone, I shall liberate thee from all sins. Giving no attention to people who laugh in ridicule, forgetting the body and insensible to shame, one should fall prostrate on the ground to all beings, even to the dog, the Chandala and the ass, for I am the All".

Blessed selves! Be integrated like Sri Krishna, be not narrow. Each man is a copy of the universal whole, hence there is no conflict among the people of the world. Each man is in truth a cosmic man as Sri Krishna was. The essence of life is common to all. The source of immortal bliss is enthroned in the heart of every creature here. The struggle of all being is towards the attainment of spiritual perfection. Let there be, therefore, a consciousness of the one beings of the universe. May the Lord broaden your hearts, brighten your intellects and divinise your natures. May the immortal blessings of Bhagavan Krishna be upon you all!.

Salutions to Lord Krishna, the Supreme Lord, who is the indweller of our hearts, who is Existence Absoulte, Knowledge Absolute, Bliss Absolute, who is the Soul of this universe, who bestows Immortality on His devotees, who is the source for everything and who took a human form for the benefit of the gods and His devotees, to destroy wickedness and establish righteousness. ✶

**Having obtained which no other gain is considered as greater, remaining in which one is not shaken evern by the heaviest of afflictions.**

**When you get angry, you lose more than your temper**

# *PHILOSOPHY OF RENUNCIATION*

**(Continued from the previous issue)**

***- Dr. Vanasri***

***Isavasyamidam sarvam-*** "This entire universe is enveloped by Almighty Supreme Being". The Supreme Being is something which cannot be divided into parts, which is infinite in its nature, which is existing everywhere to such an extent that It may appear as if it is the only thing existing. The only existing 'something' is the *Ishvara* that *IsavasyaUpanishad* speaks of. This 'something' which is alone at all times and outside which nothing can exist. This is the nature of Consciousness and is universal. This is the nature of Ultimate Reality. This is what we call it as God. This is what we call it as *Ishvara*. Therefore, this Supreme Consciousness is the Ultimate Reality. Reality is not pervasion- something entering into something else- in the ordinary sense of terms. It is one thing being all things. In a great mantra of *Rigveda* we are told ***"ekam sat viprabahudavadanti"*** (R.V 1.164.46)" The one being all sages and poets call by different names such as Indra, Varuna and Agni and so on. Therefore this world of perception, this universe of variety, is a perceptional presentation and not a modification, because eternal things cannot modify themselves. If eternity modifies itself it becomes a temporal something. That which is above time cannot become something in time.

The great sage of *Upanishads* therefore tell us "whatever is apparently moving and not moving ***"yatkimchajagathyamjagat tat sarvam- all that is IsÌhvara.*** God is not merely everywhere but He is also everything.

The universe is governed by Lord *Isa*. When this entire world is administrated by Lord how can you hate anyone. From where this hatred comes. It comes from unawareness. Unwareness is mere ignorance. When you forget your existence, Truth or Reality then we land

**You cannot make a fool of the one who keeps cool**

into dilemma. So do not forget *Isa*, the inner dweller, the governor, the controller of life in universe everywhere within and without. First of all, one should remember the Lord all the time wherever we are. "knowing this, be happy without the sense of possessiveness in regard to any objects.

***Tena tyaktenabhunjitha .ma gridhahkasyasviddanam.***

You learn to enjoy the life. How? By renunciation! Can you enjoy life by renunciation? When everything belongs to God what is ours? Nothing belongs to us. Then why do have it? "yes" we have it. It is meant for us to enjoy but not to grab it. Enjoy all this as gift of God. That is the meaning! Everything what so ever is there in the universe is given to enjoy as gift of Lord, then there is no fear of being snatched by some-one from you. This is called enjoyment with '*tyaga*', the renunciation. It is like how we enjoy swimming by pushing water backwards and leav-ing the water behind. It means while swimming we renounce the water behind to move forward. Swimmers are not supposed to grab the water, if they do so they will drown. So renunciation is the way of life. While walking also leave the step by step to move forward otherwise we will be wherever we are. The word renunciation is a great word. Hence, we cannot establish our ownership or proprietorship for anything given by Lord. Just use them, enjoy them. Mine-ness becomes the victim of great ignorance called *Maya*. Ignorance is due to *avidya* which is oppo-site to *vidya*. We suffer because of our own ignorance. This ignorance causes us to blame Lord whenever we suffer. God does not tell us to involve in unnecessary things, and invite sufferings. ***Tena tyaktenabhunjhitha says*** "O man! you have every right to enjoy by renunciation".

A thing outside you cannot become yours. How can you possess a thing that is not yours? But people convince themselves that to pos-sess it. You have a way of operating your mind and of convincing your-

**If you allow things to surprise you, you will get easily confused**

self: “this house is mine, because I have purchased it from some body”. Neither that person who got money from you really had it, nor have you really got this house as you imagined. But the operation is so very tricky that it can make you happy and unhappy. If somebody has taken away something from you and left it somewhere else you consider it as a loss and grieve that it has gone. Really it has not gone anywhere; but it is in some other location. Now suppose if that location shifts. The object is placed in another location and your mind is adjustable to the idea that it is yours and you are happy. That which is capable of leaving you for any reason what so ever, cannot belong to you. A thing that is yours cannot leave you. Anything which can leave you one day is not actually yours. Hence you should not be under impression that you will be happy only because of possessions. In this wonderful universal context of the pervasion of Lord in all things and He being all things apart from being everywhere, who will possess what? Therefore renounce attachment. It is in other way of saying sense of possessions. Happiness is a state of being and not a consequence of possessions. The greatest happiness is in the feeling that you are hale and healthy. And if you are not hale and healthy, any kind of possession will make you happy. Even in ordinary daily life you will realize that you being itself is a source of happiness. Hence happiness is the condition of being which is you. So happiness is not some consequence or some result that follows from accretion of objects into your so called personality.

Once a great thinker said that if all scriptures in the world were destroyed and if only this mantra is available, we need not learn anything afterwards. Let this one mantra remain and all the scriptures be destroyed this one verse is sufficient to save us: ***Isavasyamidamsarvam yatkimchajagatyamjagat, tenatyaktenabhunÞjitha ma gridhahkasyas viddhanam* (Isa.1)**

May the blessings of Lord Almighty and sadgurudev be upon all of us. ✶

**If I wish to advocate peace, do I have to about and scream?**

# అద్వైత సిద్ధాంత స్థాపకుడు - శ్రీ శంకర భగవత్పాదులు

**(వైశాఖ శుద్ధ పంచమి మే 9వ తేది శ్రీ ఆదిశంకర జయంతి)**

**- జమదగ్ని**

తత్వమసి, అహంబ్రహ్మాస్మి, ఆయుమాత్మా బ్రహ్మ, ప్రజ్ఞానం బ్రహ్మ - ఇవి ఉపనిషత్తుల్లోని మహావాక్యాలు. వీటి సారం ఒక్కటే. **"బ్రహ్మ ఒక్కటే, మరోటిలేదు". "ఏకంసత్"** బ్రహ్మం మాత్రమే సత్యం. ద్వితీయం అంటూ ఏదీలేదు. అద్వితీయ సిద్ధాంతానికి ఈ మహావాక్యాలు పునాదిరాళ్లు. ఈ ఉపనిషద్వాక్యాల సారాన్ని రంగరించి, సాధారణ మానవునికి అద్వైత సిద్ధాంతాన్ని అందించారు. శ్రీ శంకర భగవత్కాదులు. ఆది శంకరాచార్యులుగా, ఆది శంకరులుగా, శంకరభగవత్పాదులుగా ప్రఖ్యాతి గడించిన వీరు త్రిమాతాచార్యులలో ప్రథములు. హిందూ మత ఆలోచనా సరళిపై అత్యంత ప్రభావాన్ని చూపిన మహనీయుడు.

**యదా యదాహి ధర్మస్య. గ్లానిర్భవతి భారత,**
**అభ్యుత్థానమధర్మస్య, తదాత్మానాం సృజామ్యహమ్ - (భగవద్గీత - 4-7)**

ఎప్పుడెప్పుడు ధర్మానికి హాని చేకూరుతుందో, అధర్మం ప్రజ్వరిల్లుతుందో నన్ను నేను సృజించుకుంటాను అంటారు శ్రీకృష్ణభగవానుడు.

సుమారు వేయి సంవత్సరాలు బౌద్ధమతం మన భారత దేశంలో వ్యాప్తిచెంది, దాని ప్రభావంవల్ల హిందూధర్మానికి ముప్పు కలిగినప్పుడు హిందూధర్మ పరిరక్షణకు, పునరుద్ధరణకు సాక్షాత్తు శ్రీ శంకర భగవానుడే ఆదిశంకరులుగా జన్మనెత్తారని ఎందరో విశ్వసిస్తారు.

**దుష్టాచార వినాశాయ ప్రాతర్భూతో మహీ తలే,**
**స ఏవ శంకరాచార్య సాక్షాత్ కైవల్య నాయకః**

- దురాచారములను నశింపచేయడానికి ఈ భూమిపై సాక్షాత్తు శ్రీశంకరభగవానుడే శంకరాచార్యగా జన్న నెత్తారు.

అణుబాంబుల కంటే అక్షరాలు శక్తివంతమైనవి

**కరిష్యత్య్వవతారం స్వంశంకరో నీలలోహితః,**
**శ్రౌతస్మార్త ప్రతిష్ఠార్థం భక్తానాం హిత కామ్యయా**

– శ్రౌత స్మార్త క్రియలను సుప్రతిష్ఠంచేసి, వైదిక మార్గాన్ని సక్రమంగా నిలబెట్టడానికి సాక్షాత్తు నీలలోహితుడు స్వయంగా శంకరులుగా అవతరించారు.

పై శ్లోకాల అర్థం శ్రీ శంకర భగవత్పాదులు శ్రీ శంకరభగవానుని అవతారమే. హిందూ ధర్మ సంరక్షణకు కంకంకట్టుకున్న ఆదిగురువు.

కేరళలోని పూర్ణానది ఒడ్డున ఉన్న గ్రామం కాలడి. నంబూద్రి బ్రాహ్మది వంశస్థులైన ఆర్యమాంబ, శివగురువు దంపతులకు శివానుగ్రహంవల్ల కలిగిన పుత్రుడు శ్రీ శంకరాచార్య. శ్రీ శంకరులు జన్మకాలం గురించి వివిధ అభిప్రాయాలున్నాయి. క్రీ॥॥పూ॥ 788లో జన్మించారని ఒక వర్గం నిర్ణయిస్తే క్రీ॥పూ॥ 509లో జన్మించారని మరొకరి వాదన. ఏది ఏమైనప్పటికీ మన భారతదేశంలో హిందుమత పునర్వవస్థీకరణకు నాంది పలికిన ఆదిగురువు శంకరులు.

పిన్న వయస్సులోనే తండ్రి ఛాయను కోల్పోయిన శంకరులకు ఆర్యమాంబ ఉపనయనం జరిపించారు. వేదవిద్యలు, సంస్కృతం అతని చిరుప్రాయంలోనే అబ్బాయి. బాలబ్రహ్మచారిగా ఒక పేదరాలి ఇంట భిక్షాటనకు వెళ్లి, ఆమె ఇచ్చిన ఉసిరికాయకు సంతోషించి కనకధారా స్తోత్రాన్ని చెప్పి ఆ ఇంటి బంగారు ఉసరికలను కురిపించారు. తన తల్లికై అనుకూలంగా ఉండాలని పూర్ణానది ప్రవాహదిశనే మార్చివేశారు.

పసితనంలోనే సన్యాసదీక్ష స్వీకరించాలని కోర్కె కలిగినా తల్లి ఆర్యమాంబ అంగీకరించలేదు. నదిలో స్నానం చేస్తుండగా మొసలి పట్టుకుంటే, “అమ్మా ! నాకు సన్యాసదీక్షకై అనుమతినివ్వు” అని ప్రార్థించగా తల్లి అంగీకరించింది. మొసలి తన పట్టు విడిచింది. అంత్యకాలంలో తనను తలచుకొనగానే తిరిగి వస్తానని తల్లికి మాట ఇచ్చి గురువును వెదుకుతూ వెళ్ళారు. నర్మదా నది తీరాన గోవింద భగవత్పాదుల దర్శనం అయ్యింది. వారు శుకమహర్షి శిష్యుడైన గౌడపాదుల శిష్యులు. గోవింద పాదులు “ఎవరు నువ్వు” అని ప్రశ్నిస్తే “దశశ్లోకి”గా ప్రసిద్ధిగాంచిన శ్లోకాలతో తనను తాను పరిచయం చేసుకున్నారు. అద్వైత సారంతో నిండిన ఆ శ్లోకాలను విన్న గోవింద భగవత్పాదులు “సప్రాహ శంకర స శంకర ఏవసాక్షాత్” – సాక్షాత్తు భూమిపై అవతరించిన సదాశివుడే ఈ చిరంజీవి అని ఆశీర్వదించారు.

**నీతిగా గడించి నియమంగా జీవించటం ఉత్తముల లక్షణం**

శంకరులు ప్రస్థాన త్రయంగా ప్రసిద్ధికెక్కిన ఉపనిషత్తులకు, భగవద్గీతకు, బ్రహ్మసూత్రాలకు భాష్యం వ్రాశారు. భారతాంగర్గతమైన విష్ణుసహస్రనామాలకు కూడా భాష్యం వ్రాశారు. తరువాతి తరాలకు ఈ భాష్యాలు మౌళిక గ్రంథాలుగా పేరుగాంచినాయి.

బ్రహ్మ విద్యకు సంబంధించిన రచనలతోబాటు భజగోవిందం, శివానందలహరి, సౌందర్యలహరి, గణేశ పంచరత్న స్తోత్రంలాంటి నిత్య పఠనీయ ప్రార్థనా గ్రంథాలను రచించారు. వివేక చూడామణి, దివ్యమణి లాంటి గ్రంథం.

సమస్త భారతదేశాన్ని కాలనడకన పర్యటించి తన అద్వైత సిద్ధాంతాన్ని ప్రచారం చేశారు. ఇతర మతాలకు, అభిప్రాయాలకు చెందిన పండితులతో తన అపారమైన జ్ఞానంతో తర్కపటిమతో ఓడించి హిందూధర్మ పునఃస్థాపన చేశారు. శృంగేరి, ద్వారక, పూరి, జ్యోతిర్మఠం అని భారతదేశానికి నలు దిశలా నాలుగు మఠాలను స్థాపించి హిందూధర్మ ప్రచారానికి, అద్వైత సిద్ధాంత స్థిరీకరణకు అపారమైన సేవ చేశారు.

శ్రీ శంకరుల జీవితకాలం 32 సంవత్సరాలే. ఈ వయస్సు భగవత్ప్రసాదమే. పుట్టినప్పుడు వీరి ఆయుష్ష ఎనమిది సంవత్సరాలుగా నిర్ణయం జరిగింది. పిన్న వయస్సులో వేదవేదాంగాలను అభ్యసించి బ్రహ్మవిద్యను పంచడానికి శక్తిసామర్థ్యాలుగల ఈ చిన్నవానికి ఋషులు, మునీశ్వరులు మరో ఎనిమిది సంవత్సరాల ఆయుర్దాయం ప్రసాదించారు. శ్రీ శంకరులు వారణాసి వెళ్ళినప్పుడు ఒక మహనీయునితో తాను వ్రాసిన బ్రహ్మ సూత్రాల భాష్యంపై చర్చ జరిగింది. వారి అపారమైన జ్ఞాన సంపదను చూచిన శంకరులు ఆ మహనీయుడు సాక్షాత్తు వేదవ్యాసుడే అని తెలుసుకొని పాదాభివందనంచేసి "నేను చేయవలసిన పని అయిపోయింది. నాకు ముక్తిని ప్రసాదించమని" వేడుకున్నాడు. వ్యాస మహర్షి శంకరులతో 'నీవు జీవితాన్ని చాలించరాదు. ధర్మ వ్యతిరేకులను ఎదుర్కోవలసిన అవసరం వుంది. నీ భాష్యాలను చదివి, ఆనందించి నీకు మరో 16 ఏళ్ళ వయస్సు ప్రసాదిస్తున్నాను" అని దీవించాడు. ఈ విధంగా 32 సంవత్సరాల వయస్సు వరకు భారతదేశం కొరకు, హిందూ ధర్మం కొరకు తన జీవితాన్ని ధారపోసి చరితార్థుడయ్యాడు. శ్రీ శంకరచార్యుల నామస్మరణ ముక్తి ప్రదాయకం.

✶

**మంచి పనులు చేసేవారిని 'మహనీయులు' అంటారు, సమాజ సేవకు జీవితాన్ని సమర్పించినవారినీ 'మహాత్ములు' అంటారు.**

**నీవు ఎంత మందికి మంచిచేస్తే, నీకు అంత మంచి జరుగుతుంది**

# మహాభారతాంస్థములైన కొన్ని పాత్రలు కొన్ని ఘట్టములు మనకు తెలియబఱచు కొన్ని సత్యములు

- శ్రీమతి హేమలతా బాలసుబ్రహ్మణ్యం

1) మోహభ్రాంతిలో పడినవారు తమ సర్వస్వమును కోల్పోయి తాము కూడ ఆగర్తములోనే మునిగిపోవుదురు. శంతన మమారాజు గంగా (స్త్రీ) మోహములో పడి తన సర్వస్వమును కోల్పోయి మోహగర్తములో మునిగిపోయెను.

2) సత్యప్రతిజ్ఞ చేసినచో సంకటములో చిక్కుకొనెదమని హస్తినాపుర సింహాసన రక్షకుడైన భీషణమైన ప్రతిజ్ఞ చేసిన దేవవ్రత నామాంకితుడైన భీష్ముణి వలన తెలియుచున్నది.

3) తెలిసిచేసిన తెలియక చేసిన అపరాధమునకు దుండన తప్పక, అనుభవించవలెనని కురువంశ సింహాసనమును పరిత్యజించిన ముని శాపగ్రస్తుడైన పాండురాజు వలన తెలియుచున్నది.

4) అసూయ వంచనము పగలను మదిలో పెంచుకున్న జీవిత మంతయు వృథా అగునని గాంధారీ సహొదరుడైన శకునివలన తెలియుచున్నది.

5) ప్రతి అపరాధమునకు శిక్షయనునది తప్పక కలదని పాండవమాత యైన కుంతీదేవి తన కన్యావస్థలో వున్నప్పుడు దుర్వాసముని ప్రసాదితమైన మంత్రమును పరీక్షింపతలచి సూర్యుని ఆ వాహనముచేసి అతనివలన ఒక కుమారుని పొంది లోకాపవాదమునకు భయపడి ఆ శివును ఒక పేటికలో నుంచి దానిని నదిలో వదలివేసెను. ఈ అపరాధమునుకామె అధిక తరమైన శిక్షను పొందెను.

6) అతిక్రోధమునువలన అత్యాశలవలన మహావిరోధము సంభవించునని తన పుత్రవ్యామోహము వలనను తనదికానటువంటి కౌరవసామ్రాజ్యమును తన పుత్రులకు

మనసున చింతలు మాను - సిరిమల్లె పూస్తుంది

అప్పగించవలెనని అత్యాశ దానివలన కలిగిన క్రోధమువలనను అన్నదమ్ముల సంతానముల మధ్య విరోధము ప్రబలి అదే మహాభారత యుద్ధమునకు కారాణమయాయెను.

7) మాతా పితరులు చేసిన పాపము వారి సంతానమును బాధించునని కౌరవుల పతనము వలన తెలియుచున్నది.

8) హృదయములో అసూయా ద్వేషములతో కూడిన అత్యాశ వృద్ధి పొందితే అదే మహా వినావనమునకు దారితీయునని శతసహోదర సహితుడైన సుయోధనుని వలన తెలియుచున్నది.

9) అయోగ్యులతో స్నేహము చేసిన ఆ స్నేహము వారికే కీడుకలిగించునని సూర్యవరప్రసాదియై పాండవాగ్రజుడుగా జన్మించి సూతపుత్రుడుగా పెరిగి ఆపత్సహాయుడు బంధువు మిత్రుడుగా వచ్చిన అయోగ్యుడైన దుర్యోధనుని స్నేహమువలన కర్ణుడు నిందాపాత్రుడాయెను.

10) మనకు తెలిసి తెలియక ఏవైన పరుషవాక్యములు మన నోటి నుండి వెలువడినచో ఆ వాక్యములే హననము (చంపును) చేయునని నిండు సభలో ఎప్పుడైతే దుశ్శాసనుడు ఆమె కురులను పట్టి ఈడ్చుకొనివచ్చి ఆమె వలువలను ఒలిచెనో అప్పుడాయె నోటి నుండి వచ్చిన పరుషవాక్యములే పాంచాలీ శపథమాయెను. ఇది పాండవ పత్నియైన ద్రౌపదివలన తెలియుచున్నది.

11) గర్వము తలకెక్కిన ధర్మము కూడ ఓడిపోవునని అశ్వత్థామా యొక్క అసత్యమైన మరణవార్తను తనకిష్టము లేకున్నను తనవలన ఒక మంచి కలుగునుకదా యనే కొంచెముఉ భయాందోళనముతో కూడిన గర్వము తలకెక్కగా "అశ్వత్థామా హతః కుంజరః" అని యుధిష్ఠిరుడు చెప్పగా అప్పుడు, ధర్మస్వరూపుడైన ధర్మరాజే అలా చెప్పగా ఆ రణరంగములో ధర్మము ఓడినట్లాయెను.

12) కేవలము భుజబలపరాక్రమములు మాత్రమే పలము (విజయము) నివ్వదని జరాసంధాదుల వధానంతరము భీముని ప్రవర్తనలో కలిగిన మార్పులవలన తెలియుచున్నది.

**రాగ, ద్వేష రహితుల గృహామే స్వర్గము**

13) ఎవరైతే మనకు సమస్త విషయములందును ఆది నుండి అంతము వరకు మనతోనే వుండునో వారున్నంతవరకు మనకు సర్వత్ర సర్వవిషయములందును విషయమే లభించునని శ్రీ కృష్ణార్జునులు సఖ్యమువలన తెలియచున్నది.

14) మనము శాస్త్ర (సకల) కోవిదులైనంత మాత్రమువలన అదే శాస్త్రము మనకు సరియైన సమయములో ఉపయోగపడదు అని సర్వశాస్త్ర విశారదుడైనటువంటి మార్కండేయుడైన సహదేవుని వలన తెలియుచున్నది.

15) వివేకము లేని వేగము జయమును ప్రసాదించదని సౌభద్రుడైన అభిమన్యుడు వివేకములేని వేగముతో చక్రవ్యూహములో ప్రవేశించి దానిని ఛేదించుకొని వెలుపలికి రాలేక ప్రాణాపాయస్థితిలో తన అవివేకమువలన తనకు ఈ గతి పట్టినదని తెలుసుకొనెనని అభిమన్యునివలన తెలియుచున్నది.

16) త్రికాలజ్ఞుడు అనగా భూత భవిష్య వర్తమాన కాలముల నెరిగినవాడు అందువలన సత్యధర్శనమును పొందిన వాడు ఎల్లప్పుడు త్రికాలా బాధితుగానే వుండునని భగవానుడు (కృష్ణరూపధారియైన) నరుని రూపములో నున్న పాండవ మధ్యముడైన అర్జునునికి బోధించెను.

17) జీవితమే ఒక మహాభారతము దానిని చక్కగా అవగాహనమొనరించుకున్నచో ఆ జీవితమే మనలను సరియైన మార్గములో నడిపించును.

✶

**సర్వే జనా స్సుఖినోభవంతు**

**ధనికుడైనా దరిద్రుడైనా, పండితుడైనా, పామరుడైనా, బలవంతుడైనా, బలహీనుడైనా అందరినీ మృత్యువు సమానంగా చూస్తుంది. దానికి హెచ్చుతగ్గులు, తారతమ్యాలు ఉండవు.**

**✶ ✶ ✶**

**అన్యాయాన్ని సాక్ష్యాలతో న్యాయమని ఋజువు చేసినా కానీ, న్యాయదేవత దృష్టిలో మాత్రం అది అన్యాయమే, న్యాయం కానేరదు.**

ధర్మాచరణ వలన సత్‌బుద్ధి కలుగుతుంది

# వేదమ్మకు నీరాజనం

**కూర్పు : ఆకుల రామయ్య**

కాల ప్రవాహానికి ఎదురీది, కలకాలం నిలిచే కాలాతీత జ్ఞాన పుష్పాన్ని జడలో తురుముకొని శోభించే వేదమ్మకు,

**మనసైన నీరాజనం - మంగళకరమై నీరాజనం.**

అబ్ధి మథనంలో అమృతము ప్రాప్తిస్తే, అంతరంగ మథనంలో అద్వైతం - సిద్ధిస్తుందని బోధించిన శ్రుతిమాతకు,

**కవితాకెంపుల నీరాజనం - మమతా మాణిక్య నీరాజనం.**

ముందు నిలిచిన మనుగడే అర్థంగాని మనిషికి వెనుక నడిపే పెన్నుని మురళీ రవాన్ని వినిపించిన వేదనాద కుమారికి,

**చరాచర సార నీరాజనం - అమృత స్వరసార నీరాజనం.**

భవ సంతప్త హృదయాలను శివజ్ఞానామృతమును పోయుటలో చలివేంద్రమై విలసిల్లిన ఉపనిషత్కుమారికి,

**గీర్వాణ నీరాజనం - స్వరూప నిర్వాణ నీరాజనం.**

మతికందని గతి తానై, జతనోర్వని ద్యుతి తానై, యతిమదిలో శ్రుతిని మీటి పలుకునేర్పిన ప్రభావతికి, పలుకు కందని జ్ఞాన కళావతికి,

**చిన్ముద్ర నీరాజనం - రుద్రుని ఎద భద్ర నీరాజనం.**

లేనివాటిని ఉన్నవంటూ ఉట్టికెక్కించే ఉన్మాదంలో మతాలు ఉల్లి పువ్వుల్ని ఊరేగిస్తుంటే, ఉన్నవాటిని లేవంటూ "ఉనికి"ని వాడని మల్లెపువ్వులా ఉర్విపై ఊరేగించిన వేదవతికి,

**భావుక నీరాజనం - బలమైన తార్కిక నీరాజనం.**

బండరాతి గుండెలను కరిగించి, మనసులలో మల్లెలను పూయించి, హృదయాలలో వెన్నెలను కామించే ఋషిబిడ్డలను ప్రసవించిన వేదాంత జననికి,

**ప్రామాణ్య నీరాజనం - బహుముఖ ప్రావీణ్య నీరాజనం.**

అమృతాన్ని పానం చేసిన రాహువు రాక్షసుడగనే మిగిలిపోయినా, జ్ఞానామృతాన్ని పానం చేసిన మానవుడు మానవుడగ మిగలక సోవుటయేగాక, మాధవుడుగా వెలిగిపోతాడని ప్రమాణ మందించి నిరూపించిన శ్రుతి శిఖర సంచారిణికి, వేద విద్యావతికి,

**శ్రుతిరేవ శరణ మితినీరాజనం - అఖండరూప స్థితిరేవ నీరాజనం.** ✶

**గడిచిన కాలం ఎన్ని కాసులిచ్చినా తిరిగి రానిది**

# ఆశ్రమ వార్తలు

1) శ్రీ శివానందాశ్రమంలో నిత్య-నైమిత్తిక కార్యక్రమాలు యథావిధిగా జరుగుతున్నాయి. శ్రీ యోగబాలాజీ స్వామి అర్చనలు విధివిధానాలతో పురోహితులవారి నేతృత్వంలో కొనసాగుతున్నాయి. లలితా అమ్మవారి పూజా పునస్కారాలు సేవా కార్యక్రమాలు పద్ధతులతో నడిపిస్తున్నారు. నిత్యాన్నదానం నడుస్తున్నది.

2) శ్రీమద్భగవద్గీతా పారాయణం నెలలో నాల్గవ శనివారం యథావిధిగా నడుస్తున్నది.

3) ఉ॥ 5 1/2 నుండి 6 1/2 యోగా తరగతులు, సాయం 5 1/2 నుండి 6 1/2 మధ్యలో యోగా తరగతులు కొనసాగుతన్నాయి.

4) స్వామిని చంద్రానందగారి రామనామ సత్సంగం 2019 ఏప్రిల్ 27వ తేదీన వైభవంగా కొనసాగింది. అధ్యక్షులు శ్రీ జి. సుధీర్ కుమార్‌గారి అధ్యక్షతన నడచిన ఈ సత్సంగంలో ఎందరో భక్తులు పాల్గొన్నారు.

5) శ్రీ మద్భగవద్గీత తరగతులు జూన్ నెల నుండి పూర్వంలాగానే కొనసాగుతాయి.

6) ప్రతి మంగళవారం భక్తిగీతాల శిక్షణ జరుగుతున్నది. ఆసక్తి గలవారిని నిర్వాహకులు ఆహ్వానిస్తున్నారు.

7) స్వామి సత్యవ్రతానంద సరస్వతీ మహారాజ్‌గారి జయంతి శివానందాశ్రమంలో మే 10వ తేదీన నిర్వహించుకొంటున్నాం. గీతాపారాయణం, సత్సంగం, జయంతి సభలో పాల్గొనవలసినదిగా అందరికి ఇదే మా ఆహ్వానం (సాయం 5 నుండి 7 వరకు) ✶

**ప్రతి నెల బుధవారం రోజు ఉచిత సంస్కృత క్లాసులు సా॥ 6 గం॥ల నుండి 8.00 గం॥ల వరకు జరుగుతున్నాయి.**

**రండి! సంస్కృతం నేర్చుకోండి! సంస్కార భారతాన్ని నిర్మించండి!**

బాధలు అనుభవించిన వారే జాలి చూపగలరు

ఈ మాస విశేష భారతి

శ్రీ వికారి చైత్ర బహుళ ద్వాదశి నుండి
వైశాఖ బహుళ ద్వాదశి వరకు

## 2019 మే

01-05-2019 చైత్ర శుక్ల ద్వాదశి

03-05-2019 మాసశివరాత్రి

04-05-2019 శనివారం, అమావాస్య

06-05-2019 సోమవారం, విదియ - అల్లూరి సీతారామరాజు బలిదానం

07-05-2019 మంగళవారం, అక్షయ తృతీయ

09-05-2019 గురువారం, వైశాఖ శుక్ల పంచమి,
శ్రీ శంకరాచార్య జయంతి, రాణాప్రతాప్ జయంతి

17-05-2019 శుక్రవారం, శుక్ల చతుర్దశి, నృసింహ జయంతి

18-05-2019 శనివారం, వైశాఖ పూర్ణిమ, బుద్ధ పూర్ణిమ

22-05-2019 బుధవారం, సంకష్ట చతుర్థి


25-05-2019 శనివారం రోహిణికార్తె

28-05-2019 మంగళవారం, వైశాఖ, కృష్ణ నవమి
సావర్కర్ జయంతి, సురవరం ప్రతాపరెడ్డి జయంతి

**మెప్పించటం కోసం, గుర్తింపు కోసం, హెూదా కోసం, పేరు ప్రతిష్టల కోసం చేసే పనులను సేవ అనరు. సేవ అంటే స్వార్థ రహితము.**

*Printed and Published by G. SUDHIR KUMAR on behalf of A.P. DIVINE LIFE SOCIETY, Printed at Natural Gray Offset Press, # 10-2-11/1, Opp. IDBI Quarters, I.T. Towers Road, AC Guards, Hyderabad - 500004, Published at A.P. DIVINE LIFE SOCIETY SIVANANDA ASHRAM 6-1-110, Padmaraonagar,* Secunderabad - 500 025 *Editor Acharya Kasireddy Venkat Reddy.*
Tel : 040-27503274

మన అంతరాత్మే మనకు మంచి స్నేహితుడు



# జ్ఞాన ఫలం

**ఎఱక గలుగునాతడే యూర నుండక**
**తిరుగనేల ? తనకు దివ్యమైన**
**పండు పండ వెనుక భక్షింపకుండునా ?**
**విశ్వదాభిరామ వినురవేమ ! (వే. ప : 90)**

**అర్థం :** ఎఱుక + కలుగును + అతడు = జ్ఞానం ఉన్న మనిషి ; ఏ = అతడే ; ఊరన్+ ఉండక = తన సొంతూరిలో తానుండకుండా ; తిరుగను + ఏల = అక్కడా ఇక్కడా పోయేదెందులకు ? (అతనున్న చోటికే వస్తారని) తనకు = ఆయనకు, అంటే ఆజ్ఞానికి ; దివ్యము + ఐన = పరమోత్తమైన – శ్రేష్ఠమైన ; పండు పండ = జ్ఞానమనే ఫలం ఫలించగా; వెనుక = ఆ తర్వాత ; భక్షింపక = తినకుండా ; ఉండునా = ప్రజాసమూహం ఊరక ఉంటుందా !

**భావం :** జ్ఞానం ఉన్న వారెక్కడికి పోవాల్సిన అవసరంలేదు. వారి ఊరిలోనే వారుండాలి; అంత గొప్ప జ్ఞానమనే పండు కావాలనుకొనేవారు ఆయన దగ్గరకే వచ్చి, ఆ పండును తింటారు ; అంటే జ్ఞానం గ్రహిస్తారని అర్థం.

**వ్యాఖ్య :** ప్రతిభ గలిగిన పండితునికి కీర్తివస్తుంది. జ్ఞాని అంటే దైవంతో  సమానం. గీతాచార్యులు జ్ఞాని నేనే అంటారు. మరి అటువంటి జ్ఞానం పండు వంటిది. ఆకలిగొన్న వారు పండు తింటారు. జ్ఞానమనే ఆకలి ఉన్నవారు జ్ఞాని దగ్గరికి వచ్చి తెలుసుకొంటారు.

విద్వాన్ సర్వత్ర పూజ్యతే అన్నది నిజం. వారు జ్ఞాన ప్రచారానికి తిరిగి శ్రమపడాల్సిన అవసరంలేదు. అతని దగ్గరకే జ్ఞానాసక్తి ఉన్నవారు వస్తారన్నమాట. సాందీపుని దగ్గరికి బలరామకృష్ణులు వెళ్లినట్లు, పరమహంస దగ్గరికి నరేంద్రుడు వెళ్లినట్లు, వీరబ్రహ్మం దగ్గరికి సిద్ధప్ప వెళ్ళినట్లు జ్ఞానిదగ్గరికి భక్తులు వెడతారు. వెళ్లి తెలుసుకోవాలి అని కూడా సందేశం.

– *ఆచార్య కసిరెడ్డి*

*Date of Publication : 23.04.2019 - Posted pm 26, 27th*

***LICENCE NO. H/SD/ 517 /18-20 DT. 12.03.2018***

***RNI No. TELBIL/2002/08571***

***SIVANANDA BHARATHI (MONTHLY)***

## మంచి శ్లోకం

**గీతాశాస్త్రం**

**శ్లో॥ గీతా సుగీతా కర్తవ్యా – కిమన్యైః శాస్త్రవిస్తరైః ।**
**యాస్వయం పద్మనాభస్య – ముఖ పద్మాద్వినిస్సృతా ॥**

<u>భావం</u> : కమలనాభుడైన శ్రీకృష్ణుని ముఖపద్మం నుండి వెల్వడిన గీతను చక్కగా గానం చేయండి ! ఇక పెద్ద పెద్ద శాస్త్రాలు అధ్యయనం చేయవలసిన అవసరంలేదు. (అంటే గీతాశాస్త్రం కన్న మించిన శాస్త్రం మరొకటి లేదని అర్థం).

## మంచి పద్యం

**ఒకే దైవం**

**ఆ॥వె॥ పసుల వన్నె వేరు పాలేక వర్ణమౌ**
**పుష్పజాతి వేరు పూజ యొకటె**
**దర్శనములు వేరు దైవమదొక్కటే**
**విశ్వదాభిరామ వినుర వేమ ! (యోగి వేమన)**

**భావం** : పశువుల రంగులు వేరు. కానీ, పాలరంగు ఒక్కటే ! పుష్పాలెన్నో విధాలుగా ఉంటాయి. కానీ, పూజ ఒకే విధంగా ఉంటుంది. మేధావుల దర్శనాలు వేర్వేరుగా ఉంటాయి. కానీ దైవం ఒక్కడే ! ఇదే సత్యం.

***Book - Post (Printed Matter)***

***To***

______________________________

______________________________

______________________________

______________________________

***Printed and Published by***
***G. SUDHIR KUMAR on behalf of A.P. DIVINE LIFE SOCIETY,***
***Printed at Natural Gray Offset Press, # 10-2-11/1, Opp. IDBI Quarters,***
***I.T. Towers Road, AC Guards, Hyderabad - 500004,***
***Published at : A.P. DIVINE LIFE SOCIETY SIVANANDA ASHRAM***
***6-1-110, Padmaraonagar,*** Secunderabad - 500 025.
**Email : apdlssec@gmail.com, website : http://apdls.yolasite.com**
***Editor : Acharya Kasireddy Venkat Reddy.***
Tel : 040-27503274